RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 302 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

శుక్రవారం 17, మార్చి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## నోబెల్ శాంతి బహుమతి రేసులో ప్రధాని మోడీ

**నోబెల్ అవార్డ్స్ కమిటీ డిప్యూటీ చైర్మన్ అస్లే టోజే**



**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** ప్రపంచం శాంతిని, స్నేహాన్ని కోరుకోవడంలో ప్రధాని మోడీ ఎప్పుడూ ముందుంటారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభంలో పడనీయకుండా కాపాడారు. అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. అన్ని దేశాలతో స్నేహాన్ని

మిగతా... 2లో




## ఇడి విచారణకు కవిత గైర్హాజరు

# హస్తినలో హైడ్రామా..

- లాయర్ భరత్ ద్వారా సమాచారం
- ఉదయం నుంచి న్యాయ నిపుణులతో మంతనాలు
- సుప్రీం ఆదేశాల మేరకు నడచుకుంటామని వెల్లడి
- ఇడి ముందుకు కవిత హాజరు కావడం లేదన్న భరత్
- మహిళగా తనకున్న హక్కుల మేరకు నడుచుకుంటున్నారని వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** రాజధాని హస్తినలో హైడ్రామా నెలకొంది. ఇడి విచారణకు హాజరవుతానన్న కవిత గురువారం విచారణకు హాజరు కాకుండా మెలిక పెట్టారు. తన లాయర్ ద్వారా హాజరు కావడం లేదని సమాచారం అందించారు. మహిళల విచారణకు వెసలుబాటు ఉందని, ఆ మేరకు కవిత హాజరు కావడం లేదని పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె లాయర్ భరత్ ఇదే విషయం చెబుతూ..కవిత ఇడి విచారణకు హాజరు కావడం లేదన్నారు. ఈ క్రమంలో ఢిల్లీ తుగ్లక్ రోడ్డులో కెసిఆర్ అధికారిక నివాసం వద్ద ఉదయం నుంచి హైడ్రామా నెలకొంది. ఢిల్లీ లిక్కర్‌స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) విచారణకు ఎమ్మెల్సీ కవిత గైర్హాజరయ్యారు. విచారణకు తాను హాజరుకాలేనని తెలిపినట్లు సమాచారం. అనారోగ్య కారణాలు, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ వివరాలను ఈడి అధికారులకు ఈమెయిల్ ద్వారా పంపారని అంటున్నారు. మరో రోజు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ నెల 11న జరిగిన విచారణ సమయంలో అడిగిన పత్రాలను న్యాయవాది భరత్ ద్వారా ఈడి అధికారులకు పంపారు. అయితే విచారణకు గైర్హాజరుకావడంపై ఈడి అంగీకరించే అవకాశం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళలను ఈడి కార్యాలయానికి పిలిచి విచారణ జరపడంపై ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సుప్రీం ఇచ్చే సూచనల తరవాతనే

మిగతా... 2లో

## మోడీ,అదానీ మధ్య ఉన్న సంబంధాలేంటి?

- ఎందుకు దీనిపై మోడీ స్పందించడం లేదు
- పార్లమెంటులో ఎందుకు మాట్లాడనీయరు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రాహుల్



**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** ప్రధాని నరేంద్ర మోడీ, ప్రముఖ వ్యాపారవేత్త అదానీ మధ్య ఉన్న సంబంధాలేంటని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి ప్రశ్నించారు. తాను ప్రశ్నలు మాత్రమే లేవనెత్తానని, సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు తప్పించుకుంటోందన్నారు. అదానీ విషయంలో కేంద్రం ఎందుకు మౌనం పాటిస్తోందన్నారు. షెల్ కంపెనీల్లో ఉన్న పెట్టుబడులు ఎవరివి..? అని ప్రశ్నించారు. అదానీ కంపెనీలపై అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్టుపై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా.. ఎందుకు విచారణ చేయడం లేదన్నారు. పార్లమెంటు ఎంపీగా సభలో మాట్లాడే హక్కు తనకు లేదా..? అని రాహుల్ గాంధీ

మిగతా... 2లో

## ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎన్నిక ఏకగ్రీవం

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. అయితే ఇతర పార్టీల నుంచి ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. దీంతో అధికార పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసిన దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి ఈ ముగ్గురు ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు.

తెలంగాణ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ సిద్దిపేట జిల్లా మునిగడపలో దేశపతి గోపాలకృష్ణశర్మ, బాల సరస్వతి దంపతులకు 1970లో జన్మించారు. స్వరాష్ట్ర సాధనలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ నిర్వహించిన వేలాది సభలు, ర్యాలీల్లో దేశపతి పాల్గొన్నారు. తెలంగాణ సాధన అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి, ప్రస్తుతం సీఎం ఓఎస్డీగా పని చేస్తున్నారు.



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన కుర్మయ్యగారి నవీన్‌కుమార్ 1978 మే 15న కొండల్‌రావు, తిలోత్తమ దంపతులకు జన్మించారు. నవీన్‌కుమార్ తాత రామచంద్రరావు గతంలో మంత్రిగా పనిచేశారు. మేనమామ సుదర్శన్‌రావు టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. విద్యార్థి

మిగతా... 2లో

## కవితకు మరోసారి ఈడీ నోటీసులు

- 20న హాజరు కావాలని ఆదేశాలు
- మాగుంటకు మరోమారు ఇడి నోటీసులు
- పిళ్లై కస్టడీ మరో మూడు రోజులు పొడిగింపు

**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి ఈడీ నోటీసులు పంపింది. 20న విచారణకు రావాలని కవితకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో




పిళ్లై కస్టడీ మరో మూడురోజులు పొడిగించారు. అలాగే ఎపికి చెందిన ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డికిమరోమారు ఇడి నోటీసులు జారీ చేసింది. ఇకపోతే ఈనెల 24న సుప్రీం కోర్టులో కవిత పిటిషన్

మిగతా... 2లో



## పేపర్ లీకులో అధికార పార్టీ నేతలు

- కెటిఆర్ కుసన్నల్లోనే వ్యవహారం
- బిజెఐఎం కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ కేసులు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** టీఎస్పీఎస్సీ క్వశ్చన్ పేపర్ల లీకేజీపై ఆందోళనకు దిగిన బీజే వైఎం కార్యకర్తలను అరెస్టు చేసి నాన్ బెయిలె బుల్ కేసులు పెట్టడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తప్పుబట్టారు. ఉండటం వేస్తని, వెంటనే కేటీఆర్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ చేసినవాళ్లంతా బీఆర్ఎస్ కార్యకర్తలేనని, వాళ్లందరూ ఎదో ఒక పదవితో సంబంధం ఉన్నవాళ్లేనని

మిగతా... 2లో

## బీజేపీ పాలిత అస్సాంలో యూనివర్శిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం

**తెలంగాణ రాష్ట్ర విధానాన్ని అనుసరిస్తున్న అస్సాం**

**మరి..! రాష్ట్ర గవర్నర్ కు మాత్రం ఎందుకు అర్థం కావడం లేదో..??**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్**

**హైదరాబాదు మార్చ్ 16 (ప్రజా మంటలు):** యూనివర్సిటీలలో అధ్యాపక ఖాళీల భర్తీ కోసం కామన్ రిక్రూట్మెంట్ ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్ లలో బిల్లును ఆమోదించిన విధానాన్నే... బిజెపి పాలిత రాష్ట్రం అస్సాం కూడా ఇదే విధానాన్ని



మిగతా... 2లో

## బిఆర్ఎస్ అక్రమాలను ఎదిరిస్తాం


- పాదయాత్ర ప్రారంభించిన భట్టి

**ఆదిలాబాద్,మార్చి16(ప్రజామంటలు):** అధికార బిఆర్ఎస్ అక్రమాలను అరికట్టి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టి పాదయాత్ర గురువారం ప్రారంభమైంది. హాత్ సే హాత్ జోడో అభియాన్‌లో

మిగతా... 2లో



### ప్రజానాడి






## కవిత ఇడి కేసులో ఇరు పార్టీల డ్రామా

- ఎన్నికల ముందు ప్రజల్లో మార్కులు కొట్టేసే యత్నం
- పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు

**నిజామాబాద్,మార్చి16(ప్రజామంటలు):** కవిత ఇడి కేసులో బిజెపి, బిఆర్ఎస్ దొంగాట ఆడుతున్నాయని అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. బెంగాల్ ఎన్నికలకు ముందు అక్కడ జరిగిన డ్రామా ఇక్కడా రిపీట్ అవుతోందన్నారు. ఈ రెండు పార్టీలు కుమ్మక్కయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. స్వయం పాలనతో కూడిన సామాజిక తెలంగాణే కాంగ్రెస్ లక్ష్యమన్నారు

మిగతా... 2లో

## వరుసగా నాలుగోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

- ఆదానీ వ్యవహారంపై వాయిదా పడ్డ సభ

**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** అదానీ కుంభకోణంపై గురువారం కూడా పార్లమెంటులో గందరగోళం నెలకొంది. దీంతో ఉభయసభలను తొలుత మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే.. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి ఆందోళనలు చేపట్టారు. సభ ఆర్డర్‌లోకి వస్తే, అవకాశం కల్పిస్తానని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులను కూర్చోవాలని ఆయన కోరారు. కానీ ప్రతిపక్ష సభ్యులు అదానీ కుంభకోణంపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. దీంతో సభను రెండుగంటల



మిగతా... 2లో

## నోబెల్ శాంతి బహుమతి రేసులో ప్రధాని మోడీ

**మొదటి పేజీ తరువాయి..**
కొనసాగిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో నోబెల్ శాంతి బహుమతి రేసులో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ప్రకటించే అవార్డుల్లో ప్రధాని మోడీకి నోబెల్ శాంతి బహుమతి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల నార్వేకు చెందిన నోబెల్ అవార్డ్స్ కమిటీ భారత్ ను సందర్శించింది. నోబెల్ శాంతి బహుమతి విజేతను నిర్ణయించే ఈ కమిటీ డిప్యూటీ ఛైర్మన్ అస్లే టోజే ప్రధాని మోడీని ప్రశంసించారు. ఆయన ప్రపంచానికి చేస్తున్న సేవలను కొనియాడారు. యుద్ధాలు చేసే దేశాల చేత కూడా యుద్ధాలను ఆపించగల సత్తా ఉన్నవాడని పేర్కొన్నారు. మోడీ లాంటి శక్తివంతమైన నేతకు ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొల్పే సామర్థ్యం ఉందని కితాబిచ్చారు. మోడీ లాంటి నేత శాంతిని పెంచడంలో కీలక పాత్ర పోషించగలరని నమ్ముతున్నట్లు అస్లే టోజే వెల్లడించారు. మోడీ విధానాల వల్ల భారత్ సుసంపన్నమైన, శక్తిమంతమైన దేశంగా మారుతోందని అస్లే అన్నారు. ప్రపంచాన్ని నడపగల గొప్ప అర్హత ఉన్న నాయకుడైన ప్రధాని మోడీ.. ఈ ఏడాది అక్టోబర్ లో ప్రకటించే నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంటే అది చారిత్రాత్మకం అవుతుందని చెప్పారు.

## మోడీ,అదానీ మధ్య ఉన్న సంబంధాలేంటి?

**మొదటి పేజీ తరువాయి..**
ప్రశ్నించారు. సభలో మాట్లాడకుండా తనను ఎందుకు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అదానీ ఇష్యూను ప్రశ్నిస్తున్నందుకే సభలో తనకు మైక్ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లోక్ సభ స్పీకర్ పక్షపాత ధోరణి వీడాలని కోరారు. తాను సభలోకి వస్తున్న ఒక్క నిమిషం ముందు సభను వాయిదా వేశారని రాహుల్ చెప్పారు. తాను దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రసంగం చేయలేదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ గురువారం స్పష్టం చేశారు. పార్లమెంటుకు హాజరయ్యే మార్గంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విదేశాల్లో భారత ప్రతిష్టను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యానించారని, ఆయన క్షమాపణలు చెప్పాలంటూ ఉభయసభల్లోనూ కిరణ్ రిజిజు, పీయూష్‌గోయల్ సహా పలువురు కేంద్ర మంత్రులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. బిజెపి ఆరోపణలను రాహుల్ గాంధీ ఖండించారు. తాను దేశానికి వ్యతిరేకంగా ఎక్కడ ఎలాంటి ప్రసంగం చేయలేదని అన్నారు. ఒకవేళ తనను అనుమతిస్తే సభలో మాట్లాడతానని, అవకాశం ఇవ్వకపోతే పార్లమెంట్ బయట మాట్లాడతానని రాహుల్ పేర్కొన్నారు.

## కవితకు మరోసారి ఈడీ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి..**
విచారణకు రానుంది. కానీ సుప్రీం విచారణకు ముందే కవిత ఈడీ ముందు హాజరుకావాలని నోటీసుల్లో వెల్లడించింది. కవిత ముందు ప్రస్తుతం మూడు ఆప్షన్లు ఉన్నాయి. మార్చి 20న ఈడీ విచారణకు హాజరుకావడం, ఈడీ సమన్లపై సుప్రీం కోర్టులో స్టే కోరడం, ముందస్తు బెయిల్ కు వెళ్లడం అని నిపుణులు చెబుతున్నారు. లమార్చి 16న రామచంద్ర పిళ్ళైని రౌస్ ఎవెన్యూ కోర్టులో ఈడీ హాజరుపర్చింది. రామచంద్రపిలళ్లై కస్టడీ పొడిగించాలని ఈడీ కోర్టును కొరింది. ఈమేరకు పిళ్ళైకు ఈ నెల 20 వరకు కస్టడీ పొడిగించింది. కవితతో కలిసి విచారించాలి.. అయితే కవిత ఇవాళ విచారణకు హాజరుకాలేదని ఈడీ తెలిపింది. అందర్ని కలిసి విచారిస్తే ఎలా అని స్పెషల్ కోర్టు ధర్మాసనం ఈడీని ప్రశ్నించింది. లిక్కర్ కేసులో కవిత అనుమానితురాలని ఈడీ కోర్టుకు తెలిపింది. కవితను పిళ్ళైతో కలిపి విచారించాలని ఈడీ కోర్టును కోరింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ఈడీ మరోసారి నోటీసులిచ్చింది. 18న విచారణకు రావాలని ఈడీ ఆదేశించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సౌత్ గ్రూప్ లో మాగుంట కీలక వ్యక్తిగా భావిస్తూ విచారణకు రావాలని కొరినట్లుగా తెలుస్తోంది. కాగా ఇదే కేసులో మాగుంట శ్రీనివాసుల రెడ్డి కొడుకు మాగుంట రాఘవను ఈడీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన తీహార్ జైలులో ఉన్నాడు. కస్టడీ ముగియడంతో 16న రామచంద్ర పిళ్ళైని రౌస్ ఎవెన్యూ కోర్టులో ఈడీ హాజరు పర్చింది. రామచంద్రపి÷–లళ్లై కస్టడీ పొడిగించాలని ఈడీ కోర్టును కొరింది. కవితతో కలిసి విచారించాలి.. అయితే కవిత విచారణకు హాజరుకాలేదని ఈడీ తెలిపింది.

## బిఆర్ఎస్ అక్రమాలను ఎదిరిస్తాం

**మొదటి పేజీ తరువాయి..**
భాగంగా బజార్ హత్నూర్ మండలం పిప్రి నుంచి భట్టి పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ యాత్రలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్‌రావు ఠాక్రే, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. బజార్ హత్నూర్ నుంచి ఖమ్మం వరకు మొత్తం 1,365 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర సాగనుంది. తొలి రోజున పిప్పిరి నుంచి ఇచ్చోడ వరకు పాదయాత్ర కొనసాగి.. అక్కడ బహిరంగ సభను నిర్వహించారు. భట్టి పాదయాత్ర.. ఏడు ఉమ్మడి జిల్లాలకు చెందిన 39 నియోజకవర్గాల గుండా ఖమ్మంకు చేరుకోనుంది. 91 రోజుల పాటు కొనసాగి జూన్ 15న ఖమ్మంలో ముగుస్తుంది. అక్కడే భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఒక కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇంటి వద్ద నిర్మల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

## ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎన్నిక ఏకగ్రీవం

**మొదటి పేజీ తరువాయి..**
దశ నుంచే నవీన్‌కు రాజకీయాలంటే ఆసక్తి. 2001 నాటి జలదృశ్యం ఆవిర్భావసభ మొదలుకొని టీఆర్ఎస్ నిర్వహించిన అన్ని సమావేశాల్లో నవీన్ పనిచేశారు. కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో సొంత ఖర్చులతో వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించారు. 2019 మేలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా



ఎన్నికయ్యారు. ఈ మార్చిలో పదవీకాలం పూర్తవనున్నది. ఆయన సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్.. నవీన్‌కుమార్‌కు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనవడు కూతురు కొడుకు అయిన చల్లా వెంకట్రామిరెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు గ్రామ ప్రెసిడెంట్ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.

అనంతరం 2004 నుంచి 2009 వరకు అలంపూర్ ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. గత డిసెంబర్‌లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరారు. ఈ క్రమంలో చల్లా వెంకట్రామిరెడ్డికి సీఎం కేసీఆర్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు.

# హస్తినలో హైడ్రామా..

**మొదటి పేజీ తరువాయి..**
కవిత ఇడి విచారణకు హాజరవుతారని అంటున్నారు. ఇకపోతే ఉదయం నుంచి కెసిఆర్ నివాసంలో కెటిఆర్, హరీష్ రావు తదితరులు న్యాయ నిపుణులతో చర్చించారు. వారిచ్చిన సూచనల మేరకే కవిత విచారణకు గౌర్హాజర య్యారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో నేటి ఉదయం నుంచే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నెల 11న కవిత తొలి విచారణకు హాజరైన సందర్భంలో కూడా ఇంతటి ఉత్కంఠ నెలకొన్నది లేదు. గురువారం ఉదయం నుంచి కూడా ఢిల్లీలో హైడ్రామా నడుస్తోంది. తొలుత ఉదయం 10 గంటలకు కవిత మీడియా ముందుకు రానుందంటూ వార్త ఒకటి బయటకు వచ్చింది. ఆ తరువాత అది కాస్తా.. 10:30 కు మారింది. కానీ అది కూడా లేదు. ఇంతవరకూ ఆమె కేసీఆర్ నివాసం నుంచి బయటకు వచ్చిందే లేదు. 11 గంటలకు ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉన్నా బయటకు రాలేదు. అసలు కవిత ఈడీ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ నివాసంలో కవిత.. మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు తదితరులతో పాటు న్యాయ నిపుణులతో భేటీ అయినట్టు సమాచారం. అనంతరం 11:30 సమయంలో ఈడీ కోరిన సమాచారాన్ని సీనియర్ న్యాయవాది, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌తో ఈడీ అడిగిన సమాచారాన్ని పంపించారు. తన అనారోగ్య కారణాలతో పాటు సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని తెలిపారు. ఎమ్మెల్సీ కవిత , బీఆర్ఎస్ పై కేంద్రం కక్ష కట్టిందని ఆమె లాయర్ సోమా భరత్ మీడియాకు వెల్లడించారు. ఈడీ కోరిన సమాచారాన్ని సీనియర్ న్యాయవాది, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌తో పంపించారు. తన అనారోగ్య కారణాలతో పాటు సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని తెలిపారు. కానీ ఈడీ మాత్రం కవిత వినతిని తోసిపుచ్చింది. ఈడీ విచారణకు రావాల్సిందేనని తేల్చి చెప్పింది. దీంతో కవిత తదుపరి స్టెప్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈడీకి కవిత లేఖను అందజేసిన అనంతరం ఆమె లాయర్ సోమా భరత్ మీడియాతో మాట్లాడుతూ.. కవిత తరపున ఈడీకి కొన్ని డాక్యుమెంట్లు ఇచ్చామన్నారు. ఈడీ కోరిన డాక్యుమెంట్స్ అన్నీ ఇచ్చినట్టు తెలిపారు. కవితపై కేంద్రం కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టిందన్నారు. సీఆర్పీసీ ప్రకారం, మనీలాండరింగ్ యాక్ట్ 50 ప్రకారం.. మహిళలను ఇంటి దగ్గరే ప్రశ్నించాలన్నారు. 6 గంటల్లోపే విచారణ జరపాలన్న నిబంధన ఉందన్నారు. మహిళల హక్కులను కేంద్రం ఉల్లంఘిస్తోందన్నారు. ఇంటి దగ్గర ప్రశ్నించాలన్న కవిత విజ్ఞప్తిని ఈడీ తిరస్కరించింద న్నారు. చట్ట ప్రకారం ఇంటి దగ్గరే విచారణ జరపాలన్నారు. ఈడీ ఎలాంటి నోటీసు, డేట్స్ ఇవ్వలేదని కవిత లాయర్ భరత్ వెల్లడించారు. ఎమ్మెల్సీ కవితను.. ఆమె ఇంటికొచ్చి విచారించాలని.. సీఆర్పీసీ, మనీ లాండరింగ్ సెక్షన్ 15 కింద మహిళలను ఇంటికొచ్చి విచారించొచ్చని.. ఆ నిబంధన కిందే ఈడీ అధికారులకు డాక్యుమెంట్లు సమర్పించినట్లు లాయర్ సోమ భరత్ తెలిపారు. ఈ విషయంపైనే సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశామని.. మార్చి 24వ తేదీ విచారణకు వస్తుందని.. కోర్టు చెప్పినట్లు నడుచుకుంటాం అన్నారు. గత విచారణలో ఈడీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని.. సెల్ ఫోన్ బలవంతంగా తీసుకున్నారని లాయర్ ఆరోపించారు. మనీలాండరింగ్ కేసులో సెక్షన్ 15 కింద మహిళలు, 15 ఏళ్లలోపు పిల్లలను ఇంటికొచ్చి విచారించాల్సి ఉందని.. అదే విధంగా సాయంత్రం ఆరు గంటలలోపు విచారణ పూర్తి చేయాలని.. గత విచారణలో రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు ఆఫీసులోనే ఉంచుకోవటం ఏంటని ప్రశ్నించారు. ఈడీ అధికారుల విచారణ తీరు బాగోలేదన్నారు. మహిళగా తమకు ఉన్న హక్కులను కవిత ఉపయోగించుకుంటున్నారని.. హక్కులను ఉల్లఘించటాన్ని ప్రశ్నిస్తున్నారని చెప్పుకొచ్చారు లాయర్ సోమ భరత్. అనారోగ్యంతో విచారణకు హాజరుకాలేదని వస్తున్న వార్తల్లో నిజం లేదని వివరణ ఇచ్చారు.

కవిత తరపున కొన్ని డాక్యుమెంట్లను ఈడీ అధికారులకు సమర్పించామని.. వివరించారు. సుప్రీంకోర్టులో పిటీషన్ పై విచారణ మార్చి 24వ తేదీ జరుగుతుందని.. కోర్టు తీర్పును అనుగుణంగా నడుచుకుంటామని కవిత లాయర్ తెలిపారు.

## కవిత ఇడి కేసులో ఇరు పార్టీల డ్రామా

**మొదటి పేజీ తరువాయి..**
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీంగల్ లోని లింబాద్రి లక్ష్మి నరసింహ స్వామి దర్శనం చేసుకున్నారు రేవంత్ రెడ్డి. చారిత్రక



లింబాద్రి లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ తల్లికి బంధ విముక్తి కలిగించేందుకే ఈ పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. నరసింహస్వామి సాక్షిగా నేను ప్రశ్నిస్తున్నా..తెలంగాణ వచ్చినా ఇక్కడి రైతులను ప్రభుత్వం ఆదుకుందా అని అడిగారు. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ తెలంగాణలో నిరుద్యోగుల జీవితాల్లో మాత్రం మార్పు రాలేదని మండిపడ్డారు. తెలంగాణ వచ్చినా ప్రజల కష్టాలు తీరలేదన్న రేవంత్..పోరాటంలో, పట్టుదలలో, పౌరుషంలో నిజామాబాద్ రైతులు హర్యానా రైతులకు తక్కువేం కాదన్నారు. కేసీఆర్ కుడి భుజం అని చెప్పుకునే మంత్రి ప్రశాంత్ రెడ్డిని అడుగుతున్నా..ఈ ప్రాంతంలో చెరుకు పరిశ్రమను ఎందుకు మూసివేశారు.. ఎందుకు ఇక్కడి రైతులను ఆదుకోవడంలేదని నిలదీశారు.

తెలంగాణ రాష్ట్రంలో మార్పు రావాల్సిన అవసరం లేదా.. లేదా.. చైతన్యం కలిగిన రైతులు ఒక్కసారి ఆలోచన చేయండి అని రేవంత్ రెడ్డి కోరారు. సుదర్శన్ రెడ్డి, మండవ లాంటి గొప్ప నాయకులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉండి ఈ ప్రాంతం గౌరవాన్ని పెంచారు..కానీ ఇప్పుడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ జిల్లా పరువు తీస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ ఏ దోపిడీ చూసినా మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు గణేశ్, జీవన్ రెడ్డిపేర్లే వినిపిస్తున్నాయన్నారు. ఇసుక దోపిడీ చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించిన రేవంత్ రెడ్డి..ఇంత దారుణమైన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదవన్నారు.

# మరోమారు కరోనా పంజా

### రాజస్థాన్‌లో నలుగురు విదేశీయుల్లో గుర్తింపు

జయపుర,మార్చి16(ప్రజామంటలు): ఇప్పుడిప్పుడే కరోనా నుంచి




కోలుకుంటున్న సమయంలో మరోసారి ఈ ప్రాణంతాక వైరస్ పంజా విసురుతోంది. రాజ స్థాన్‌లో నలుగురు విదేశీయులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం రేపుతోంది.

ఆస్ట్రేలియా నుండి రాజస్థాన్‌ను సందర్శించడానికి వచ్చిన ఒక మహిళతో సహా నలుగురు విదేశీ పర్యాటకులకు కోవిడ్-19 పాజిటివ్ ఉన్నట్లు తేలింది. రాజస్థాన్‌ను సందర్శించేందుకు వచ్చిన నలుగురు ఆస్ట్రేలియన్లు..సవాయ్ మాధోపూర్‌లోని ఓ హోటల్ లో బస చేసినట్లు రాజస్థాన్ యూనివర్సిటీ ఫర్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుధీర్ బండారీ తెలిపారు. నలుగురు జైపూర్ కు వచ్చారని..అక్కడ వారికి టెస్టులు నిర్వహించగా..కోవిడ్ ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం ఈ నలుగురు విదేశీయులు రాజస్థాన్ యూనివర్శిటీ ఫర్ హెల్త్ సైన్సెస్ లో చేరినట్లు వివరించారు. ఈ నలుగురిలో ముగ్గురి పరిస్థితి సాధారణంగా ఉందని..మరో వ్యక్తి స్వల్పలక్షణాలతో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. మరోవైపు దేశంలో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతుండటంతో ...కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలను అలర్ట్ చేసింది. మార్చి 11వ తేదీన కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్..అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. కొన్ని రాష్ట్రాల్లో కోవిడ్-19 టెస్ట్ పాజిటివిటీ రేట్లు క్రమంగా పెరుగుతుండటంతో ....అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త కేసులు రోజు రోజుకు పెరుగుతున్నా...ఆసుపత్రుల్లో తక్కువగానే చేరుతున్నారని చెప్పారు. వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల కోవిడ్ ప్రభావం తక్కువగా ఉందని..అయినా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా సృష్టించిన విలయతాండవం అంతా ఇంతా కాదు. మూడేళ్ల క్రితం చైనాలో వెలుగు చూసిన ఈ మహమ్మారి.. భారతదేశాన్ని అతలాకుతలం చేసింది. కరోనా దెబ్బకు మన దేశంతో పాటు.. ప్రపంచ దేశాల్లో లక్షలాది మంది మృత్యువాత పడ్డారు. ఎన్నో కుటుంబాలను కోవిడ్ విచ్ఛిన్నం చేసింది. ఎన్నో జీవితాలను నాశనం చేసింది.

## పేపర్ లీకులో అధికార పార్టీ నేతలు

**మొదటి పేజీ తరువాయి..**
తెలిపారు. ఈ ఘట నలో కారణం అయిన నిందితులను బీఆర్ఎస్ పార్టీ కాపాడేప్రయత్నం చేస్తుందని మండి పడ్డారు. అరెస్టయిన కార్యకర్తలను పరామర్శించ డానికి గురువారం చంచల్ గూడ సెంట్రల్ జైల్ కు వెళ్లిన బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వ పని తీరును తప్పుబట్టారు. సీఎం కేసీఆర్, కేటీఆర్ రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని అన్నారు. తప్పు చేసినవాళ్లను వదిలిపెట్టి న్యాయం కోసం పోరాడుతున్న వాళ్లను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. దాదాపు ఏడుగురు బీజేవైఎం కార్యకర్తలను అరెస్ట్ చేసి వాళ్లపై నాన్ బెయిలబుల్ వారెంట్ పెట్టడంపై పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కేటీఆర్ మంత్రిగా ఇంచార్జ్ తీసుకున్న వన్నీ ఫెయిల్ అయ్యాయని మండిపడ్డారు. ధరణి స్కాం, పోయిన ఏడాది జరిగిన ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్, ఇప్పుడు జరిగిన టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారం కూడా కేటీఆర్ ఐటీ శాఖ కనుసన్నంల్లోనే జరిగాయని మండి పడ్డారు. ఇవన్నీ జరుగుతున్నా కేటీఆర్ పై సీఎం కేసీఆర్ స్పందించక పోవడం హాస్యాస్పదం అని బండి అన్నారు. పనులు చేయరానివాడు మంత్రిగా రాష్ట్రంలో సీఎం, కేటీఆర్, కవితకు ఒక రూల్, మిగిలిన వాళ్లందరికీ ఒక రూల్ నడుస్తుందని విమర్శించారు. వీటన్నింటినీ వదిలిపెట్టి న్యాయం కోసం ఆందోళన చేసినవాళ్లను నాన్ బెయిలబుల్ వారెంట్ లేకుండా అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే పేపర్ లీక్ కు కారణమైనవాళ్లను సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరిపించాలని తెలిపారు.

## వరుసగా నాలుగోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

**మొదటి పేజీ తరువాయి..**
వరకు వాయిదా వేశారు. అదానీ కుంభకోణంపై జెపిసి వేసి విచారణ చేపట్టాలని, సభలో చర్చ జరపాలంటూ ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలను ఇచ్చాయి. ÷రాజ్యసభ లోనూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేశారు. రూల్ 267 కింద బిజినెస్‌ను సస్పెండ్ చేసి అదానీ జేపీసీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ ఎంపి రంజీత్ రంజన్ తెలిపారు. కార్పొరేట్ ఫ్రాడ్, పొలిటికల్ కరప్షన్, స్టాక్ మార్కెట్ మానిప్యులేషన్, ఫైనాన్షియల్ మిస్‌మేనేజ్మెంట్ అంశాలపై అదానీని విచారించాలని రంజన్ తన నోటీసులో కోరారు. దేశంలో భావ స్వేచ్ఛ లేకుండా పోయిందని, ఈ అంశంపై చర్చించాలని డాక్టర్ సయ్యిద్ నసీర్ హుసేన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలంటూ కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దేశాన్ని కించపరిచారని ఆరోపించారు. ఈ గందరగోళం మధ్య రాజ్యసభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది.

# బీజేపీ పాలిత అస్సాంలో యూనివర్శిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)
అనుసరిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విధానానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఆమోదం లభిస్తోందని, కానీ రాష్ట్ర గవర్నర్ కు మాత్రం ఈ విధానం ఎందుకు అర్థం కావడం లేదు అని వినోద్ కుమార్ విస్మయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఏర్పాటు చేయాలన్న విధానాన్ని బిజెపి పాలిత రాష్ట్రమైన అస్సాంలో అమలు చేయాలని అస్సాం రాష్ట్ర క్యాబినెట్ తాజాగా గురువారం నిర్ణయం తీసుకున్నదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ విధానం చాలా గొప్పదని, ఈ విషయం జాతీయ స్థాయిలో నిరూపితం అవుతోందని వినోద్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలలో కామన్ రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ లలో బిల్లును ఆమోదించి ఈ దస్త్రాన్ని రాష్ట్ర గవర్నర్ వద్దకు పంపగా, ఈ బిల్లును ఆమోదించకుండా గవర్నర్ గత ఆరు నెలలుగా తన కార్యాలయంలో అట్టి పెట్టారని వినోద్ కుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో ఆమోదం పొందిన తెలంగాణ ప్రభుత్వ యూనివర్శిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డు విధానాన్ని గమనించి రాష్ట్ర గవర్నర్ ఇప్పటికైనా యూనివర్సిటీ కామన్ రిక్రూట్మెంట్ బోర్డ్ బిల్లును ఆమోదం తెలపాలని, తద్వారా యూనివర్శిటీలలో దాదాపు రెండు వేల అధ్యాపక పోస్టుల భర్తీ అవుతాయని వినోద్ కుమార్ అన్నారు.


# హైదరాబాద్ నగరాన్ని కమ్మేసిన మబ్బు

### ఉరుములతో కూడిన చిరుజల్లులు

### చల్లగా మారిన నగర వాతావరణం

### పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు

హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు): హైదరాబాద్ నగరంలోచల్లని వాతావరణం ఏర్పడింది. గురువారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. భాగ్యనగరాన్ని కారుమబ్బులు కమ్మేశాయి. ఇక మధ్యాహ్నం 2 గంటల సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉరుములతో కూడిన వర్షం పడుతోంది. దీంతో నగగరంలో చల్లని గాలులు వీచాయి. ఉదయం అక్కడక్కడ సూర్యుడు కనిపించి నప్పటికీ, కాసేపటికే మళ్లీ మబ్బులు కమ్మేశాయి. ఇక మధ్యాహ్నం 2 గంటల సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం పడింది. మొత్తంగా వర్షం కురియడంతో ఏర్పడిన చల్లదనంతో నగరవాసులు చిల్ అయ్యారు. వికారాబాద్, సంగగారెడ్డి జిల్లాల్లో పలు చోట్ల వడగండ్ల వర్షం కురిసింది. వానల నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా



అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే. రాబోయే 48 గంటల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు లేదా ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని బుధవారం వెల్లడించింది. జార్ఖండ్ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ఉన్న ద్రోణి బుధవారం ఒడిశా వైపు కదిలిందని, తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో వానలు పడుతాయని వివరించింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వచ్చే ఐదు రోజులు యెల్లో హెచ్చరిక జారీ చేసింది. గురువారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసాయి. శుక్ర, శని, ఆదివారాల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి- భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వివరించారు.

## కుందారంలో 'స్వయం పరిపాలన దినోత్సవం'

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కుందారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా గురువారం ఉపాద్యాయులుగా విద్యార్ధులు మారారు. ఈ సందర్భంగా







విద్యార్థులు ఉత్సాహంగా సమర్ధవంతంగా వారి వారికి కేటాయించిన భాద్యతలు నిర్వర్తించారు. హెచ్ ఎం గా బి.శ్రావ్య, ఎం.ఇ.ఇ. గా డి. స్వప్న, డి.ఇ.ఓ. గా ఎం. ఈశ్వర్ వ్యవహరించారు. విద్యార్థులను ఉపాద్యాయుల బృందం అభినందించారు. ఈ కార్యక్రమం లో హెడ్మాస్టర్ కె. కృష్ణ మూర్తి, ఉపాధ్యాయులు పొట్టబత్తిని భాస్కర్,టి. నవీన్ కుమార్, డి.లావణ్య, వి. జ్యోతి పాల్గొన్నారు.

## గుండెపోటుపై అవగాహన కలిగిస్తున్న కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** జనగామ నియోజకవర్గంలోని చేర్యాలలో గల ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో గురువారం కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి ఆధ్వర్యంలో





విద్యార్థిని విద్యార్థులకు, కళాశాల అధ్యాపక బృందానికి గుండెపోటుకు గురైనప్పుడు సిఆర్‌పి ఏ విధంగా చేసి ప్రాణాలు రక్షించాలో ప్రత్యక్షంగా డెమో చేసి చూపించారు. మానవ మనుగడకు తోడ్పడుతున్న డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ దాదాపు రెండు డిగ్రీ కళాశాలలో 400 మంది పైగా విద్యార్థులకు అవగాహనను కల్పించారు. బిక్షపతి కి కళాశాల యజమాన్యం ధన్యవాదాలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన కళాశాల యజమాన్యానికి డాక్టర్ మాచర్ల బిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు.

## 34వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని ఇందిరమ్మ 3డవ విడత లబ్ధిదారులు గత 34 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, వెంటనే పట్టాలు ఇవ్వాలని మూడవ విడత ఇందిరమ్మ



కాలనీ అధ్యక్షులు కళ్యాణం లింగం డిమాండ్ చేశారు. చిట్యాల ఐలమ్మ నగర్ డబల్ బెడ్రూమ్ ల వద్ద మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల రిలే నిరాహార దీక్షలు హోలియా 34వ రోజు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిట్టల శారద, ఎర్ర రజిత, పాముకుంట్ల చందు, పొన్నాల ఉమా, గండ్ర చంద్రశేఖర్, మచ్చ వరలక్ష్మి, కూకట్ల యాకయ్య, కత్తి మల్లమ్మ, బాల్దె స్వరూప, ఎన్. రాజు, పి. పద్మ, ఎండి. సంరిన్, ఎం. శ్రామిక తదితరులు పాల్గొన్నారు.




సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ లో పౌరసరఫరాల శాఖ అధికారులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ తో సివిల్ సప్లై ఏ.ఎస్.వో సరస్వతీ కలసి సోషల్ ఆడిట్ తో పాటు తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు

## నేరేడుపల్లి పాఠశాలలో ఆకర్షిస్తున్న కృత్యాధార పద్ధతిలో విద్యాబోధన

**భూపాలపల్లి మార్చి 16 (ప్రజామంటలు):** భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కృత్యాధార పద్ధతిలో కొనసాగిస్తున్న విద్యాబోధనను విద్యార్థులు ఆసక్తితో వీక్షిస్తూ పద్ధతులకు ఆకర్షితులౌతున్నారు. పాఠశాలలో తెలుగు పండిట్ తిరునగరి పద్మ ఎంతో శ్రద్ధ కనబరుస్తూ పట్టుదలతో 6వ తరగతి పాఠ్యాంశంలో 'పల్లెటూరి పిల్లగాడా' అనే పాఠం విద్యార్థులకు కృత్యాధార బోధనలో కొనసాగిస్తున్నారు. పల్లెటూర్లలో పిల్లలు కొంతమంది పాఠశాలకు వెళ్లకుండా పశువులను కాయడానికి వెళతారు. వారి తల్లిదండ్రులు జీతగాడిలాగా వాళ్ళని పెడతారు. వారికి చదువుకోవాలని ఉన్న కూడా బలవంతంగా పశువులను కాస్తున్నారు. వెళ్లే దారిలో ఉన్న పాఠశాల ముందుకు వచ్చి తొంగి చూసి బాధపడుతున్న నేపథ్యం. "చదువు లేకపోతే జీవితంలో వెలుగు లేదు" అని చాటి చెప్పే పాఠం సారాంశం.



**7 గురు విద్యార్థులు ఇందులో పాత్రదారులు.**

పల్లెటూరి పిల్లగాడుగా బన్నీ, పాలికాపు రాజ్ కుమార్, దొంగ గొర్ల పాత్రదారులుగా ఐదు విజయ్, మేఘన, అర్చన, శృతి అలాగే ఇతర పాత్రదారులు కళ్యాణ్ రామ్, హేమంత్ యాదవ్, చరణ్, కృష్ణ కౌశిక్, స్వస్తిక్ పాల్గొన్నారు. పాఠ్యాంశాలను కొన్నింటిని పాఠశాల గోడలపై చిత్రించి కూడా బోధన కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ బృందం సునీత, ప్రవీణ్, పులాల సాంబయ్య, మంజుల, విజయలక్ష్మి, లావణ్య, కుమార్, మల్లికార్జున్ ప్రక్రియను ప్రోత్సాహిస్తూ విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు.

## పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి

**నర్మెట్ట మార్చి 16 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ ధారవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో మండలం అమ్మాపూర్ గ్రామంలో బిజెపి పార్టీ ప్రతిష్టాత్మక చేపట్టిన స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అమ్మాపూర్ గ్రామంలోని శక్తి కేంద్రంలో బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగ్యనగర్ ఇంచార్జ్ కేవీఎల్ఎన్ రెడ్డి, మరియు బిజెపి రాష్ట్ర నాయకులు సామాజిక వేత్త ముక్కెర తిరుపతి రెడ్డి హాజరయ్యారు. అనంతరం అమ్మాపూర్ గ్రామంలో రెండు బూతులు అనగా 139,140 బూతులలో పని విభజన చేసి మరియు ప్రముఖులను నియమించారు. అనంతరం మాట్లాడుతూ.... పార్టీ బలోపేతం కోసం బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త ఒక సైనికుల్లా పనిచేయాలని తొమ్మిదిళ్ల పాలనలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని అదేవిధంగా ప్రతి గడపగడపకు వేళ్లి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షులు లింగాల మహేష్, బిజెపి మండల గంగం ప్రభాకర్ రెడ్డి పబ్బోజు నవీన్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు కొర్ర సాయినాథ్, సీనియర్



నాయకులు కొమురవెల్లి, మోహన్, బూత్ అధ్యక్షులు కుంటి శ్రీధర్, ధరావత్ దేవేందర్, చెవుల రాజు, సిద్ధులు, సుధాకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో టిఎస్పీఎస్ చైర్మన్ దిష్టిబొమ్మ దగ్ధం

**జగిత్యాల్ మార్చి 16 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతుందని ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ సాయికుమార్ అన్నారు. టిఎస్పిఎస్సి పత్రాల లీకేజీని నిరసిస్తూ టిఎస్పీఎస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి దిష్టిబొమ్మను ఏబీవీపీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు సాయికుమార్ మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగ నియామక నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. విద్యార్థి నిరుద్యోగుల డిమాండ్ తో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆ పరీక్షలను పారదర్శకంగా జరపకుండా వ్యవహరించడంతో ప్రశ్నాపత్రాలు లీకై లక్షలాదిమంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. పరీక్షలు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, అదేవిధంగా చేతగాని రాష్ట్రప్రభుత్వం వెంటనే గద్దె దిగి పోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విస్తరక్ నల్ల నవీన్, నగర కార్యదర్శి మనువాడ నందు, జోనల్ ఇంచార్జిలు రాజు, కార్తిక్, శ్రీనివాస్, మనోహర్, వినయ్, పాల్గొన్నారు.



## జనగామలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** జనగామ పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ మద్రాస్ రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అవమానాలు భరించలేక తెలుగు వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని, 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని పోరాడమని కేసీఆర్ కూడా అన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు బిజ్జాల నవీన్, అవోపా జిల్లా అధ్యక్షులు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు పజ్జూరి జయహరి, పట్టణ అధ్యక్షులు అర్గుల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి జైన రమేష్, సభ్యులు బెలిద శ్రీధర్, గౌడిశాల శివరామకృష్ణ, అయిత శ్రీనివాసులు, తాడూరి సంతోష్, గట్టు శ్రీనివాస్, తడకమల్ల నరసింహారావు, బెలిదె శ్రీధర్ గుప్త, ఎర్రం ప్రసాద్, గట్టు రాధాకిషన్ పాల్గొన్నారు.




## బూత్ స్వశక్తి కిరణ్ అభియాన్

**తరిగొప్పుల మార్చి 16 (ప్రజామంటలు):** మండలంలోని అంకుషాపూర్ గ్రామంలోని 146,147,148 బూత్ లలో మండల అధ్యక్షుడు ఆవుల శ్రీను అధ్యక్షతన గురువారం రోజున శక్తి కేంద్ర ఇంఛార్జిలతో, మరియు బూత్ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఎల్ఎన్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ప్రభారీ ముక్కెర తిరుపతి రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ పాల్గొని పార్టీ సంస్థాగత నిర్ణయం పై మార్గ నిర్దేశం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆవుల శ్రీను, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండ ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు తలకోకుల శ్రీనివాస్, కర్రే పోచయ్య, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గూగులొతు ప్రవీణ్ నాయక్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అల్పతి నాయక్, బూత్ అధ్యక్షులు పోగుల ఎల్లయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే సిబ్బందికి రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు

**సికింద్రాబాద్ మార్చి 16 ( ప్రజామంటలు):** రైల్వే కోచింగ్ డిపోలో గురువారం బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జి.శంకర్ రాజు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు.



మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, వీటి వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న, అని మన నిర్లక్ష్యంతో మనతో పాటు ఇతరులకు కూడ నష్టం వాటిల్లుతుందని అన్నారు. పీపీటీ ప్రజంటేషన్ తో రైల్వే అధికారులు, ఉద్యోగ సిబ్బందికి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ అధికారి మజీద్ ఖాన్, రైల్వే కోచింగ్ డిపో అధికారులు ప్రభాత్ కుమార్ పాటిల్, బబిత, వంశీకృష్ణ, అశోక్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు

**హన్మకొండ మార్చి 16 (ప్రజామంటలు):** కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల ఆద్వర్యంలో ఇమ్ప్లికేషన్స్ ఆఫ్ ఎన్.ఇ.పి 2020 ఆన్ మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ - ఇష్యుస్ అండ్ ఛాలెంజెస్ అనే అంశం




పై రెండు రోజుల జాతీయ సదస్సు( మార్చి 17 - 18 తెదిల్లలో), విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల సెమినార్ హాల్ లో నిర్వహిస్తునట్టు, 17 వ తేదిన జరుగు ప్రారంభ సమావేశం ముఖ్య అతిదిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ హాజరవుతారని, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ గౌరవ సంచాలకులు ప్రొ.బి సుధాకర్ రెడ్డి కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిధులు గా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొ.ఆర్ నాగేశ్వర్ రావు, నాందేడ్ ఎస్.ఆర్.టి.ఎం యూనివర్సిటీ నుంచి ప్రొ. వాణి లతుర్కర్, డీన్ ప్రొఫెసర్ కే రాజి రెడ్డి, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ప్రొ. పి అమరావేణి పాల్గొంటారని, కళాశాల ప్రిన్సిపాల్, సెమినార్ డైరెక్టర్ ప్రొ. పి వరలక్ష్మి తెలిపారు.

## నేషనల్ హాకీ ఛాంపియన్ టీంకు సెలెక్టయిన వాగ్దేవి డిగ్రీ విద్యార్థి


**హుజూరాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** హుజూరాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి మనుగొండ



వంశీ, నేషనల్ హాకీ ఛాంపియన్ టీం కి సెలెక్ట్ అయినట్టు కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశీ ప్రస్తుతం బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడని, ఏప్రిల్ 28 నుండి మే 8 తారీకు వరకు జరిగే 13వ హాకీ ఇండియా జూనియర్ మెన్ నేషనల్ ఛాంపియన్షిప్ కి ఎన్నిక కావడం పట్ల కళాశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి వంశీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి, రమేష్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## టి.ఎస్.పి.ఎస్. చైర్మన్ రాజీనామా చేయాలి

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** టి.ఎస్.పి.ఎస్. చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలి. ఉద్యోగ నియమక పేపర్ లీకేజీ పై సిబిసిఐడి తో



సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ అడిషనల్ ఏవో కి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ ఆద్వర్యంలో వినతి పత్రం అందజేత. డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు దూసరి నాగరాజ్ భానోతు ధర్మబిక్షం, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వలబోజు కళ్యాణ్ మారేడి ,డివైఎఫ్ఐ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ భాషాభాక విష్ణు పంతులు, సురేష్, గుర్రం శశిధర్ ఓల్లాల భాను పాల్గొన్నారు.

# మోడీని ఢీకొనడంలో ఐక్యత మృగ్యం!



దేశంలో బిజెపికి ప్రత్యామ్నాయాం సృష్టించడంలో ప్రాంతీయ పార్టీలు విఫలం అవుతూ వస్తున్నాయి. కాంగ్రెస్‌తో కలసి వెళ్లాలని కొందరు..కాంగ్రెస్ లేకుండా వెళ్లాలని మరికొందరు వాదులాడుకుకుంటు న్నాయి. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలన్నీ టచ్‌లో ఉన్నాయని, రానున్న రోజుల్లో తామంతా కలసి కట్టుగా సాగుతామని కాంగ్రెస్ భావిస్తోంది. తనకు సమాధి కట్టాలని కాంగ్రెస్ భావిస్తే తాను మాత్రం దేశ నిర్మాణంలో ముందుకు సాగుతున్నానని మోడీ ప్రజలకు చెబుతున్నారు. ఇకపోతే వరుసగా వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతిపక్షాలు మోదీని ఎదుర్కొనే విషయంలో వెనక్కి తగ్గుతున్నాయనే భావించాలి. మునుపటి దూకుడును ప్రదర్శించడం లేదు. ఇడి,ఐటి దాడుల తరవాత ఒక్కో పార్టీ నైజమేమిటో..వాటి గుణగణ్యాలేంటో తెలుస్తోంది. అన్ని పార్టీలు అవినీతి మరకలను అంటించుకున్నవే. ఏ ఒక్కటి కూడా బురదపడకుండా ఉన్ పార్టీ కాదని తేలిపోయింది. ఇదే ఇప్పుడు మోడీ బలంగా మారింది. అందుకే ఇడి కేసులపై ఎదురుదాడికి దిగుతు న్నారు. లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవిత ఇడిపై ఎదురుదాడికి దిగడం..నన్ను బెదిరి స్తోంది అనడం..ఆడవాళ్లను ఇంటికే వచ్చి విచారించాలని అనడం చూస్తుంటే..సుద్దపూస మాటలను ఎవరు కూడా నమ్మరని గుర్తించాలి. తప్పులు చేసిన వారు ఆడా మగా అయినా తప్పించుకోలేరు. ఇందిరాగాంధీ, జయలలిత, శశికల లాంటి వారంతా విచారణలకు హాజరయ్యారు. తప్పులకు శిక్షలు అనుభవించారు. ఇవన్నీ కూడా ఆయా పార్టీల్లో అవినీతి వ్యవహారాలను బయటపెడుతున్నాయి. దీంతో మోడీ సహజంగానే ఇలాంటి కేసుల ఆధారంగా ప్రాంతీయ పార్టీలను దునుమాడుతున్నారు. వాటిని మట్టుపెట్టే ప్రయత్నం లో ఉన్నారు. ఇకపోతే ఆదానీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ ఇడిని కలిసేందుకు వెళ్లగా అందులో పలు రాజకీయ పార్టీలు ఆ గుంపులో కనిపించ లేదు. తృణమూల్ ఎందుకనో కాంగ్రెస్‌తో దూరం పెంచుకుం టోంది. ఇప్పటికే కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేసిన బిజెపి ప్రాంతీయ పార్టీలను నిర్మూలించడంపై ఎప్పుడో దృష్టిసారించింది. తమ అస్తిత్వం కాపాడుకోవడానికై కెసిఆర్ ఇప్పటికే పోరాటం చేపట్టారు. బిఆర్ఎస్‌తో తన పోరాటాన్ని ఉధృతం చేశారు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తమ ప్రయోజ నాలను కాపాడుకోవడానికైనా కలిసికట్టుగా వస్తాయన్న భావన కనిపించడం లేదు. ఈ ఏడాది మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. బిజెపి దూకుడును అడ్డుకోవాలంటే ముందుగా ఆ పార్టీ ప్రత్యర్థులు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలపై,పాలనపై దృష్టి కేంద్రీకరించాలి. బిజెపిని ఎదుర్కోవడానికి వాటికి సమిష్టి పోరాటం అవసరం. యూపి అనుభవం నుంచి ఆయా ప్రాంతీయ పార్టీలు పాఠాలు నేర్చుకోవాలి. గత ఎనిమిది సంవత్సరాల్లో తరచూ వస్తోన్న ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడం చిన్న విషయం కాదు. మళ్లీ మళ్లీ బిజెపికి ఓటు ఎందుకులే అన్న నిరాసక్తత జనంలో రాకుండా బిజెపి చూసుకుంటోంది. ఓటింగ్‌కు వెళ్లాలి, బిజెపిని గెలిపించాలి అన్న ఒక రకమైన భావనను బిజెపి బలంగా ప్రచారం చేస్తోంది. కేవలం సామాజిక సమీకరణాలే కాకుండా,క్షేత్రస్థాయి నుంచి పనిచేసే బలమైన సంస్థాగత శక్తిని బిజెపి పటిష్టం చేసుకుంటూ పోతోంది. గోరంత అభివృద్ధిని కొండంతగా.. గోరంత పనులను కొండంతగా భూతద్దంలో చూపే ప్రయత్నాలు నిరంతరం సాగుతున్నాయి. బిజెపితో తమకేమి ఒరిగిందిలే అని సామాన్య ప్రజలు భావించ కుండా నిరంతరాయంగా వారిని బిజెపి మూడ్‌లోకి తీసుకుని వచ్చే యత్నాలు సోషల్ మీడియా ద్వారా చేస్తూనే ఉన్నారు. ఈమంత్రం తెలిసినందు వల్ల వారిని లబ్దిదారులుగా గుర్తించి నిరంతరాయంగా బిజెపి నేతలు వారిపైనే దృష్టి కేంద్రీకరించారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే బిజెపిలో ఎలాంటి లుకలుకలు లేవు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే కాదు, జాతీయ, రాష్ట్ర పార్టీలు కూడా కలిసికట్టుగా పనిచేసేలా చూసుకుంటున్నారు. అలాగే నరేంద్రమోడీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో సమర్థిం చేలా వాతావరణం సృష్టిస్తున్నారు. వ్యతిరేకత రాకుండా మసిపూసి మారేడుగాయ చేస్తున్నారు. అందుకే రాజకీయ క్రీడలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని మించినవారు లేరని ఇటీవలి రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ కూడా అనేక ఎత్తులు వేసినా మోడీ ఎత్తుల ముందు ఫలించలేదు. యూపిలో అఖిలేశ్ యాదవ్ ఎత్తుగడలను ఎదుర్కోవడం బిజెపికి పెద్దగా కష్టం కాలేదు. ఎందుకంటే ఎన్నికల సమీకరణాల్లో వారు ఆరితేరారు. ఎంత కష్టపడ్డప్పటికీ ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా సమాజ్‌వాది పార్టీ ప్రభావం చూపలేదన్న విషయం స్పష్టమైంది. నరేంద్రమోదీ, అమిత్‌షాలు ఎన్నికల వ్యూహంలో దిట్టలు. కనుక ప్రాంతీయ పార్టీలు ప్రజల మనసులు గెల్చుకుని కలసి కట్టుగా ముందుకు వెళతారన్న ఆశలు కానరావడం లేదు. బిఆర్ఎస్‌తో కెసిఆర్ ఇంకా అడుగులు వేయడం లేదు. కూతురు కవిత ఇడి కేసులో ఇరుక్కోవడం ఇప్పుడు ఆయనకు పెద్ద తలనొప్పిగా మారింది. అందుకే తెలంగాణలో మళ్లీ అధికారం లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. బిజెపిని, వ్యక్తిగతం గా మోడీని టార్గెట్ చేస్తున్నారు. కెసిఆర్ కూడా ప్రాంతీయ పార్టీల నేతలతో కలుస్తున్నా పెద్దగా ప్రభావం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీల కలయిక అన్నది ఎండమావి అని చెప్పక తప్పదు. అలాగే కాంగ్రెస్ కూడా పెద్దన్న తరహా పాత్ర పోషించడంలో విఫలం అవుతోంది. ఈ క్రమంలో మోడీని ఢీకొనే విషయంలో పలు పార్టీల్లో ఐక్యత కానరావడం లేదు. అంతేగాకుండా అది సాధ్యం కాదని కూడా తేలిపోయింది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

**-ఎడిటర్**

## ఫస్ట్ ఎయిడ్

అడవిలో సింహం ఒక సమావేశం ఏర్పాటు చేసింది. రాజు గారి సమావేశం కాబట్టి జంతువులన్నీ హాజరయ్యాయి. ఏనుగు , ఎలుగుబంటి, పులి, ఖడ్గ మృగం వంటి పెద్ద జంతువులు వచ్చి కూర్చున్నాయి. జింక, లేడి, నక్క తోడేలు, కుందేళ్ళు లాంటి చిన్న జంతువులన్నీ ఒక వైపుగా కూర్చున్నాయి. నీళ్ళలో నివసించే మొసళ్ళు, తాబేళ్ళు, చేపలు ఇంకో పక్కనున్ననీటి మడుగులో కూర్చుని చూస్తున్నాయి. కాకులు, గద్దలు,



పిచ్చుకలు, చిలుకలు వంటి ఆకాశంలో ఎగిరే పక్షులు సమావేశ స్థలంలో ఉన్న చేతల్ మీద వాలి ఉన్నాయి. అడవి పరిపాలన గురించిన కొన్ని విషయాల గురించి సింహం వివరిస్తున్నది. అన్నీ శ్రద్ధగా వింటున్నాయి.

అన్ని జంతువులూ ఒకే చోటకు వచ్చేసరికి క్రిక్కిరిసి పోయింది. ఆలస్యంగా వచ్చిన కొన్ని జంతువులు నిలబడే ఉన్నాయి కూర్చోవటానికి స్థలం లేక నిలబడాల్సి వచ్చింది. ఉపిరి ఆడకుండా ఉన్నట్లు అనిపించింది.

ఉన్నట్లుండి ఒక లేడి కళ్ళు తిరిగి పడిపోయింది. సాధారణంగా సమావేశాల్లో, స్కూళ్ళలో కొంతమంది కళ్ళు తిరిగి పడిపోతుంటారు. అక్కడ ఉన్న జంతువులన్నీ దూరంగా జరిగాయి.కాసిని నీళ్ళు తెచ్చి ముఖాన కొట్టారు. లేడిని తట్టి మరి పిలిచారు. లేడి పలకలేదు సరికదా మొహం అంత నీలిరంగులోకి మారింది. ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నది. కొద్దిగా అనుభవమున్న వారు చూసి వెంటనే వైద్యుని వద్దకు తీసుకువెళితే మంచిది అన్నారు.

సింహం వెంటనే వైద్యుని పిలిపించండి అన్నది "కాదు మహాప్రభూ! రోగినే డాక్టరు వద్దకు తీసుకేలదాం. అక్కడ మందులు, పరికరాలు ఉంటాయి" అంటూ ఎలుగుబంటి రాజుకు విన్నవించింది. సింహం సరే నని తల ఊపింది.

నెమలి వైద్యుని వద్దకు లేడిని తీసుకెళ్ళారు సింహం జంతువులు మాట్లాడుకునే సరికి కొద్దిగా సమయం పట్టింది. ఈ లోపల పిల్ల జంతువులు ఫోటోలు తీస్తూ వీడియోలు తీస్తూ వాట్సప్ లో ఫేస్ బుక్ లో పోస్ట్ చేస్తున్నాయి. విళ్ళందరిని తప్పించుకొని లేడిని తీసుకు వెళ్ళేసరికి ఆలస్యం అయింది.

లేడిని నెమలి దగ్గరకు తీసుకువెళ్ళారు. అప్పటికి కూడా లేడి లేవలేదు. స్పృహలోకి రాలేదు. నెమలి రోగిని పరీక్షించి " లేడికి గుండె పోటు వచ్చింది" అని చెప్పింది. వెంటనే అక్కడున్నవారిని "ఫస్ట్ ఎయిడ్ చేశారా? అని అడిగింది. 'లేదు' అని జవాబిచ్చాయి జంతువులు.

లేడిని నేల మీద వెల్లికిలా పడుకోబెట్టి గుండె మీద నొక్కటం ప్రారంభించింది. జంతువులన్నీ ఆశ్చర్యంగా చూస్తున్నాయి. గుండె నెప్పి ఏమిటి? ఇది మనుషులకు వస్తుందని విన్నాం గానీ మనక్కూడా వస్తుందా? అని తమలో తాము మాట్లాడుకోనసాగాయి.

నెమలి చెప్తూ ఉంది. " ఉన్నట్లుండి ఎవరైనా పడిపోతే ముందుగ ఫస్ట్ ఎయిడ్ చేయాలి. ఆసుపత్రికి వచ్చేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. గుండె పోటంటే ప్రాణాంతకమైన జబ్బు. గుండె పని చెయ్యటం మానేస్తే మెదడుకు రక్త ప్రసారం జరగక కణాలన్నీ చచ్చిపోతాయి" మాట్లాడుతూనే నెమలి కార్డియాక్ మసాజ్ చేస్తున్నది.

ఐదు నిమిషాలకు లేడి కళ్ళు తెరిచింది. చుట్టూ ఉన్న జంతువులన్నీ సంతోషించాయి. లేడి ప్రాణం కాపాడావని నెమలి మెచ్చుకున్నాయి. లేడిని పలకరించే ప్రయత్నం చేశాయి.

ఆగండాగండి! లేడిని విసిగించవద్దు. అంతా అయిపోలేదు. నేను కేవలం ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేశాను. ఇప్పుడు దీనిని పట్నం తీసుకెళ్ళాలి. అక్కడ వెటర్నరి డాక్టరుకు చూపిస్తే అయన ఆపరేషన్ చేస్తాడు గుండెలో రక్తనాళాలు పూడుకు పోయాయి. కాబట్టి వెంటనే పట్నం తీసుకెళ్ళాలి. ఆలస్యం చేస్తే ప్రమాదం అంటూ నెమలి హెచ్చరించింది.

అన్ని జంతువులూ మోహా మొహాలు చూసుకున్నాయి. ఇదేమిటి ఆపరేషన్ చెయ్యటం. అది గుండె అపరేషనంటే మాటలా అని మాట్లడు కోసాగాయి. సింహరాజు కలగజేసుకొని వెంటనే ఏర్పాట్లు చేయండి అని ఆదేశించింది.చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడు నెమలి, సింహం ముందుకు వచ్చి ఇలా అన్నది. రాజా! మీతో ఒక మాట చెప్పాలి. ఎప్పుడైనా ఇలా ప్రాణపాయం సంభవించినప్పుడు డాక్టరు వద్దకు వెంటనే తీసుకురావాలి. ఒకవేళ ఎక్కువ సమయం పట్టేలా ఉంటే అక్కడే ఫస్ట్ ఎయిడ్ చేయాలి. నేనొక సలహా చెప్తాను. కొంత మంది యువతకు ఫస్ట్ ఎయిడ్ చేయటం నేర్పిద్దాం మీరు ఆజ్ఞాపించండి!

సింహం సానుకూలంగా స్పందించింది. అలాగే వైద్యులు గారూ! మీ ఆలోచన అద్భుతం. రేపే కొంతమందిని మీ దగ్గరకు పంపిస్తాను. నేర్పించండి ప్రాణాలు కాపాడే పని అంటే సంతోషమే గదా అన్నది. నెమలి సంతోషంగా నమస్కారం చేసింది.

సింహం మాటలకు జంతువులన్నీ హర్షధ్వానాలు చేశాయి.

**– డా.. కందేపి రాణీప్రసాద్. సిరిసిల్ల**

# బహుముఖ ప్రజ్ఞాశాలి నాళం కృష్ణారావు

### మార్చి 17...నాళం కృష్ణారావు వర్ధంతి

నాళం కృష్ణారావు (జనవరి 18 , 1881 – మార్చి 17, 1961) బాల సాహిత్యబ్రహ్మ, మధుర కవి. తెలుగు వైతాళికుడు. సంఘ సంస్కర్త. గౌతమీ గ్రంథాలయం స్థాపకుడు."మానవసేవ" పత్రిక సంపాదకులు. స్వాతంత్ర్య సమర యోధుడు, బహు భాషావేత్త.



బ్రహ్మ సమాజం మతస్థుడిగా తన గురువు అయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి కన్నా ముందే జంధ్యాన్ని పరి త్యజించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. వితంతు వివాహాలు జరిపించారు.ఇతర కులస్థులతో తన పెద్ద కుమారునికి వివాహం జరిపించారు. చింతా శేషయ్య అనే అట్టడుగు కులస్థుడికి తన యింట్లో నివాసం ఏర్పరిచి బ్రహ్మ మతస్థుడిగా తీర్చిదిద్దారు.

ఇక సాహిత్యం విషయానికి వస్తే...నాళం కృష్ణారావు అద్భుతమైన భావుకుడు.

బాలసాహిత్యంలో నాళంది అగ్రస్థానం. ప్రకృతి కవిత్వంలో , భావ కవిత్వంలో నాళంది అందె వేసిన చేయి. అయన పద్యాలు తెలుగు భాషకు సొబగులు. వాటిని చదివితే తెలుగు భాష సుపరిచితమై, పద్య రచనా పాటవం పెరుగుతుంది. వినూత్న భావాలు మదిలో మెదలుతాయి. చిన్న చిన్న కథల్ని తేటగీతి పద్యాల్లో చెప్పటం నాళం ప్రత్యేకత. ముఖ్యంగా పిల్లలకు తేలికగా అర్థమయ్యే రీతిలో పద్యాలు రచించారు. చిన్ని చిన్ని పదాలతో తేట తెలుగు పలుకుల రుచి చూపించారు. తేటగీతులలో అద్భుత కావ్యరచనలు చేశారు.

నాళం కృష్ణారావు 1881 జనవరి 18 తేదీన నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానంగా తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. 1911–15 ప్రాంతాలలో ఆయన నిర్వహించిన తొలి తెలుగు సచిత్రమాస పత్రిక 'మానవ సేవ'.

పుస్తక పఠనాసక్తిని కలిగించేందుకు 1898వ సంవత్సరంలో రాజమహేంద్ర వరంలో వీరేశలింగం గ్రంథ భాండాగారాన్ని నెలకొల్పారు. అదే క్రమంగా వృద్ధి చెంది వసురాయ గ్రంథ మండలిగా మారింది. దానికే సర్వజన గ్రంథ మండలి అనే పేరు కూడా వచ్చింది. ఎలాంటి విచక్షణకు తావు లేకుండా సమాజం లోని సర్వ సభ్యులకు గ్రంథాలయం ప్రవేశాన్ని కలిగించింది.

కృష్ణారావు పదిహేడో ఏట రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయమే ఈ నాటికీ అదే పేరుతో ఆంధ్ర దేశంలోని విలువైన, ప్రముఖమైన గ్రంథాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్నది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి అధ్యక్షులుగా, నాళం కృష్ణారావు కార్యదర్శిగా ఉన్న రోజుల్లో స్వర్ణయుగాన్ని చూసింది గౌతమి. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించిన హితకారిణీ సమాజానికి, వీరేశలింగ పాఠశాలకు పంతులు తర్వాత జీవితాంతం అధ్యక్షులుగా పని చేశారు.

ఆయన రాసిన 'గాంధీ విజయధ్వజ నాటకం' (1921), 'గాంధీ దశావతార లీలలు' (1932) గ్రంథాలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. పదివేల సామెతలు జాతీయ లోకోక్తులు పేరుతో సేకరించారు. కృష్ణారావు లాఠీఛార్జి, జైలు జీవితం మరొక పార్శ్వం సాహిత్యం. బాల్యం నుండి తుదిశ్వాస వరకు తేటగీతులలో కావ్య రచన చేశారు. కృష్ణారావు ఆశలన్నీ భావిభారత పౌరులయిన పిల్లల పైనే ఉండేవి. అందుకే ఆయన కావ్యనాయకుడు పిల్లవాడు. ఆయా 'గోరుముద్దలు', 'మీగడ తరగలు', 'వెన్న బుడగలు', 'పాల తరగలు' 'తేనె చినుకలు' తినిపిం చారు. 'వెన్నెల వెలుగులు', 'విరిదండ', 'దీపావళి' 'పాపాయి' లను అందించారు.

మీగడ తరకలు (కవితాసంకలనం)

గోరుముద్దలు, వెన్న బుడగలు, పాల తరకలు, తేనె చినుకులు,

వెన్నెల వెలుగులు, విరిదండ, దీపావళి, ముద్దు – పాపాయి,

గ్రంథాలయ సూక్తులు, మిత్ర లేఖావళి, అనుతాపము,

దేశమాత పరిదేవనము, వితంతు వివాహ చరిత్ర, స్త్రీల యెడ పురుషుల గావించు, పంచ మహా పాతకాలు,

ప్రేమ సాగరము, తెలుగు జాతీయములు, శ్రీ కృష్ణరాయాంధ్ర విజ్ఞాన సర్వస్వము, గాంధీమహాత్ముని దశావతార లీలలు తదితర రచనలు చేశారు. వీటిలో కొన్ని పుస్తకాలను గుంటూరులోని బొమ్మిడాల ఛారిటబుల్ ట్రస్ట్ వారు 2011 లో పునర్ముద్రణ గావించారు.

ఆయన సతీమణి నాళం సుశీలమ్మ తమ విదేశీ వస్త్రాలన్నీ దహనం చేసి, మహాత్ముడు రాజమండ్రి వచ్చినప్పుడు ఆయనకు పండ్లరసం అందించారు.

కృష్ణారావు నిరాడంబరుడు. కీర్తికాంక్షా రహితుడు.'సేవ'కే ప్రాధాన్యం ఇచ్చిన మనిషి. తమ అనంతరం మానవసేవ చేయాల్సిందిగా, తన తనయ కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మను నిర్దేశించారు.1961 మార్చి 17 న మరణించారు.



**-ఆర్కె సంగనభట్ల**
**9440595494**

# మోడీని ఆకాశానికి ఎత్తడంతోనే సరి


దేశంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా నడుస్తోంది! ఆయన వ్యూహాల ముందు మిగతా పార్టీల వ్యూహాలు చెల్లకుండా పోతున్నాయి. అందుకే తానే సర్వం తెలిసిన వాడిననే భావనతో ఆయన ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తను అనుకున్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఇవ్వాళ ఈ స్థాయికి రావడానికి ఆ పార్టీకి చెందిన ఎంతోమంది నాయకులు.. ముఖ్యంగా ఎల్.కె.ఆద్వాణీ వంటివారి ఆశిస్సులు ఉన్నాయి. ఇప్పుడు వారినందరినీ ఎక్కడ ఉంచారో అందరికీ తెలిసిందే! ప్రధానమంత్రి కాలేకపోయినా రాష్ట్రపతి అయినా అవుదామనుకున్న ఆద్వాణీ కలలను తుంచివేసారు. ఒకప్పుడు వేదికలపై ఆసీనులైన బీజేపీ అగ్ర నాయకులకు వెనుక నుంచి మంచినీళ్ల సీసాలను అందించిన నరేంద్ర మోదీ, ఇప్పుడు అదే నాయకులు తన ముందు స్వేచ్ఛగా కూర్చోలేని పరిస్థితి కల్పించారు. అంటే పదవితో పాటు గాంభీర్యాన్ని, అహాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో ప్రజల సమస్యలపై నేరుగా చర్చించే అవకాశం పార్టీ వేదికలపైనా లేకుండా చేసుకున్నారు. పార్టీలో దీనిపై చర్చ జరగడం లేదు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. విదేశీ పర్యటనలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో ప్రజల గురించి తెలుసుకునే అవకావం లేదు. అమెరికా అధ్యక్షుడు సుప్రీం అన్న భావన ఇతర దేశాల అధినేతలకు ఉంటుంది. కానీ మోడీ ఇప్పుడలాంటి భావనలో ఉన్నారన్న భావన కల్పిస్తున్నారు. అందుకే సమస్యలను పరిష్కరించగలిగామని, వాటిని అధిగమించామని భావిస్తున్నారు. అదేరీతిలో ప్రజలను నమ్మించడానికి ప్రధాని నరేంద్రమోడీ 9ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అందుకే నోట్ల రద్దు, జిఎస్టీ వంటి విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి చర్చించే ధైర్యం చేయలేదు. ఎవరూ ప్రశ్నించడానికి వీలుకాని భారీ బహిరంగసభల్లో మాత్రం అనర్గళంగా మాట్లాడుతూ విపక్షాలను దుమ్మెత్తి పోస్తుంటారు. ఇతర దేశాల అగ్రనేతల ఆలింగనాల్లో సేదతీరుతున్న ప్రధాని మోడీకి దేశంలోని సమస్యలు అస్సలు కనిపించకపోవచ్చు. ప్రవాస భారతీయుల చప్పట్లకు అలవాటు పడిన పెద్దమనిషికి దేశంలోని ప్రజల ఇక్కట్లు విని పించకపోవచ్చు. అందుకే సమస్యలు పరిష్కారం కాక ప్రజల్లో అసహనం రాజ్యమేలు తోంది. తాము కోరుకున్నదేమిటి? దేశంలో జరుగుతున్న దేమిటి? అనే ప్రశ్న క్రమేణా బలపడుతోంది. అభివృద్ధి పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రధాని దేశాటనలు చేస్తూ దేశ సమస్యలను మాత్రం నడిబజారులో వదిలారు. చైనాతో సరిహద్దు సమస్యలు, డార్జిలింగ్ వ్యవహారాలను పరిష్కరించే మార్గాలను అన్వేషించడం లేదు. వీటికి తోడు రైతుల ఆత్మహత్యలు – ఆక్రందనలు, కార్మికుల ఆందోళనలు పట్టించుకోవడం లేదు. పెద్దనోట్ల రద్దు తర్వాత జరిగిన ఎన్నికలు లాభించడంతో తమ నిర్ణయాలను ప్రజలు సమర్థిం




చారని ప్రచారం చేసుకుంటున్నారు. నోట్ల రద్దుతో పాటు, నల్లధనంపై తమ పోరాటిన్ని ప్రజలు సమర్థించారని గట్టిగా ప్రచారం చేసుకుంటు న్నారు. నల్లధనంపై పోరాటంలో తాము రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నామని అంటున్నారు. దేశంలో నల్లధనాన్ని, అవినీతిని నిర్మూలించడానికి పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ పదేపదే చెప్పుకొచ్చారు. ఈ చర్య సత్ఫలితాలు ఇచ్చిందో లేదో మాత్రం చెప్పడం లేదు. నగదు రహిత లావాదేవీల నినాదం కూడా తెరవెనుకకు వెళ్లింది. మరో ఏడాదిన్నరలో ఎన్నికలు రానున్న తరుణంలో ఇక ఇదే పంథా సాగడం ఖాయం. ప్రజలకు సంబంధించిన విషయాలకన్నా ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే ఆలోచనలే ఎక్కువగా ఉంటాయి. ఏడాదిన్నర కాలం గడిస్తే మళ్లీ అధికారం దక్కినా ప్రజలు మాత్రం ఆశించిన విధంగా పాలన ఉండదని గుర్తుంచుకోవాలి. మొత్తంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఒకటి.. జరిగేది ఇంకొకటి అన్న చందాన ఉంది. బీజేపీ పాలకులు వేస్తున్న ప్రతి అడుగు.. పేదలపై పిడుగుగా మారుతోంది. బీజేపీ ఇన్నాళ్లుగా కల్పిస్తున్న భ్రమలు పటాపంచలు అవుతున్నాయి. ముసుగులు తొలుగుతున్నాయి. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి, ధరలు పెంచి ఖర్చు డబుల్ చేశారు. నల్ల చట్టాలపై రైతులు దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తే క్షమాపణతో సరిపెట్టి చట్టాలను వెనక్కి తీసుకున్నారు. మరి పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రజలు నష్టపోయారు.. కష్టపడ్డారు.. పరిశ్రమలు మూతపడి దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది.. దీనికి మాత్రం నేటికీ సమాధానం రావడం లేదు. ఇకపోతే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఎన్ని ఉద్యోగాలు కల్పించారన్నది జవాబులేని ప్రశ్నగా ఉంది. రూ.2 వేల నోట్లు తేవడం వల్ల నగదు చలామణిని నియంత్రించాలన్న లక్ష్యం నెరవేరలేదు. పైగా అవినీతి పెరిగింది.

# కార్పోరేట్ క్రీడలో బలవుతున్న పిల్లలు

విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇందుకు గల కారణాల గురించి మాట్లాడిన ప్రతిసారీ పిల్లలపై రుద్దుతున్న చదువు...ఒత్తిడి అంశం బలంగా కనిపిస్తున్నది. గతంలో నీరదారెడ్డి కమిటీ చేసిన సూచనలు బుట్టదాఖలు అయ్యాయి. వాటి గురించి ఎవరూ మాట్లాడడం లేదు. అప్పుడు చాలామంది పిల్లలకు ఆసక్తి ఉన్న చదువుల గురించి, ఒత్తిడి తట్టుకునే మానసిక సంసిద్ధత గురించి, కౌన్సిలింగ్ వంటి చర్యల గురించి ఎన్నో సూచనలు సలహాలు వస్తున్నాయి. ఆ తరవాత



వాటిని అంతా మరచి పోతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు అధికారిక సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి, తూతూ మంత్రంగా కొన్ని ప్రకటనలు చేసి చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ మధ్యనే చోటుచేసుకున్న సాత్విక్ ఆత్మహత్య సంఘటన విషయంలో కూడా కొంత ఆందోళన తర్వాత, అంతా సద్దుమణిగింది, అలాంటి మరొక మరణం సంభవించే వరకూ అందరూ మౌనం వహించడం జరుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడానికి ఏర్పాటైన ప్రొఫెసర్ నీరదా రెడ్డి కమిటి కార్పొరేట్ కాలేజీలను 'కాన్సంట్రేషన్ కాంప్స్'గా అభిశంసించి, విలువైన సిఫార్సులు చేసింది. అయితే ప్రభుత్వాల స్వార్థ ప్రయోజనాల వల్ల, ఆ సిఫార్సులేవీ ఆచరణకు నోచుకోక బుట్టదాఖలయ్యాయి. ఒత్తిడి కలిగించే చదువుల గురించి గాక, ఆ ఒత్తిడి నివారణ గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నది ముఖ్యం. అంతులేని ఒత్తిడిని కలిగించే ఈ చదువుల విధానానికి రూపకల్పన చేసింది ఎవరన్నది కూడా ముఖ్యం. ప్రజలందరికీ మంచి ప్రమాణాలతో విద్యనందించే బాధ్యతను విడనాడి, ప్రైవేటీకరణకు ఊతమిచ్చి, అక్కడితో ఆపకుండా అక్రమంగా గొలుసుకట్టు కార్పొరేట్ విద్యాసంస్థలను అనుమతించి, వాటిలో అతికొన్నింటిని గుత్తాధిపత్యం వహించే స్థాయికి తెచ్చిన దాంట్లో ప్రభుత్వానిదే బాధ్యత. విద్యా వ్యాపార పోటీలో మార్కులు, ర్యాంకులే పరమావధిగా తయారై, వాటి ఆధారంగా పిల్లల సెక్షన్స్ విడదీయడం జరుగుతోంది. దీనితో తక్కువ మార్కులు, ర్యాంకులు వచ్చిన పిల్లలలో న్యూనతాభావం పెంపొంది, మరింత ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే ఆ సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులపై, పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. ఈ అవాంఛనీయ, అశాస్త్రీయ పోటీ మంటల్లో పిల్లలు శలభాల్లా బలైపోతుంటే, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి లబ్ది పొందుతున్న పార్టీలు మాత్రం ఇలాంటి ఘటనలపై పెద్దగా స్పందించడం లేదు. అధిక ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకున్న నగరాలు, మహానగరాల నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే కళాశాలల్లో ప్రవేశం పొందగలుగుతున్నారు. ప్రభుత్వాల విధానాలు ప్రజల జీవితాలను అంతటా ప్రభావితం చేస్తున్నప్పుడు ప్రజలు కూడా అటే మొగ్గ చూపుతున్నారు. ఆస్తులు అమ్మైనా, అప్పులు చేసైనా, తల తాకట్టు పెట్టైనా పేరు మోసిన, బ్రాండ్ ఇమేజ్ ఉన్న విద్యా సంస్థలలో చదివించాలని తాపత్రయపడుతుండడం వల్ల కూడా పిల్లలు బలవుతున్నారు. ఈ క్రమంలో పాలకులు ప్రభుత్వ విద్యా సంస్థలను భ్రష్టు పట్టించాయి. అక్కడ వారు కోరుకున్న చదువులు రావనే భావం తల్లిదండ్రులలో బలంగా నాటుకు పోయింది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకున్న కార్పొరేట్ విద్యా సంస్థలు చేస్తున్న ప్రచారం తల్లిదండ్రులను ఆకట్టుకుంటోంది. నిజానికి స్కూళ్లలో ఒకే రకమైన సంస్కృతి కి విద్యాశాఖ ఇప్పటికైనా కృషి చేయాలి. పేద,ధనిక తేడా లేకుండా చేయాలన్న సంకల్పం చాటాలి. పాఠశాల స్థాయిలోనే ఎలాంటి భేదభావాలు లేకుండా పిల్లలు చదువుకోగలిగేలా చూడాలి. పిల్లల్లో ఎలాంటి విభేదాలు రాకుండా విద్యావిధానం సాగాలి. అప్పుడే ఓ మంచి సమాజం ఎదగ గలదు. విద్యా సంస్థల్లో ఒత్తిడిని జొప్పించాలని చూడడం సరికాదని పెద్దలు గుర్తించాలి.



# తునికాకు సేకరణ ధర పెంపు

### సేకరణదారులకు బోనస్ చెక్కుల అందచేత

**బెల్లంపల్లి,మార్చి16(ప్రజామంటలు):** బీడీ ఆకుల సేకరణలో కట్టకు రూ. 2.05 పైసల నుంచి రూ. 3 కు పెంచామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. ఈ సీజన్ నుంచే పెరిగిన రేట్లు వర్తింపజేస్తున్నామని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలో తునికాకు సేకరణదారులకు గురువారం బోనస్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీలకు తునికాకు సేకరణ రెండో పంటగా, ఆర్థిక వనరుగా ఉపయోగ పడుతుందని అన్నారు. తునికాకు సేకరణ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో కూలీలకు బోనస్ రూపంలో రెవెన్యూ నెట్ షేర్ ను చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2016 నుంచి 2021 వరకు రూ.200 కోట్లను బోనస్ చెల్లిస్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సిర్పూర్ నియోజకవర్గం నుంచి తునికాకు కూలీలకు బోనస్ ను చెల్లించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో రూ.10. 45 కోట్లను లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, పీసీసీఎఫ్ ఆర్.డొబ్రియల్, డి.ఎఫ్.వో ఆశిష్ సింగ్ పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరుతో డబ్బుల వసూళ్లు

**మహబూబాబాద్,మార్చి16(ప్రజామంటలు):** మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండల పరిధిలో మావోయిస్టుల పేరుతో కొంతమంది డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. డిమాండ్ చేసిన డబ్బు ఇవ్వకపోతే కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారు. దీంతో బాధిత వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో అంతర్ జిల్లాకు చెందిన నలుగురు సభ్యుల నకిలీ నక్సల్స్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రమణబాబుమీడియాకు వెల్లడించారు. ఈ ముఠా సభ్యుల నుంచి ఒక ఎయిర్ పిస్టల్, రూ. 1. 20 లక్షల నగదు, 4 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులంతా గతంలో ప్రజా ప్రతిఘటన విప్లవ గ్రూపుల్లో పని చేసిన వారేనని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా శిక్షిస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

# హైటెక్ సిటీలో బోర్డు తిప్పేసిన ఐటి కంపెనీ

### నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్లు

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** మాదాపూర్ హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. కొండాపూర్‌లో ఉన్న యునైటెడ్ అలయన్స్ టెక్నాలజీ పేరుతో ముగ్గురు వ్యక్తులు ఐటీ కంపెనీ ఏర్పాటు చేసి భారీ మోసానికి పాల్పడ్డారు. వీరు సాఫ్ట్ వేర్ జాబ్ పేరిట ఎంతో మంది నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో వసూలు చేశారు. కంపెనీ యాజమాన్యం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.లక్షన్నర నుండి మూడున్నర లక్షలు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. జాబ్ ఇచ్చిన కంపెనీ.. నెల రోజుల పాటు అన్ లైన్ ట్రైనింగ్ ఇచ్చింది. ట్రైనింగ్ పూర్తయినా.. నెల




రోజులుగా కంపెనీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో బాధితులు కొండాపూర్ కు వచ్చి ఆరా తీశారు. కంపెనీ మూతబడి ఉండటంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ధీరజ్ ముత్యాల, అఖిల్, విషశ్రీ అనే ముగ్గురు వ్యక్తులు ఉద్యోగం ఇస్తామంటూ తమ నుండి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని బాధితులైనా పవన్, రితీష్, యతీష్ లు పోలీసు ఫిర్యాదులో వెల్లడించారు. తమ బ్యాంకుల నుండి డబ్బులు పంపించినట్లు బ్యాంకు అకౌంట్లతో సహా పోలీసులకు అందించారు. తమ న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఖమ్మంలో మిర్చికి రికార్డు ధర

### జెండాపాటలో క్వింటాకు గరిష్ఠ ధర రూ.23 వేలు

**ఖమ్మం,మార్చి16(ప్రజామంటలు):** ఎర్ర బంగారంగా పిలువబడుతున్న ఎండుమిర్చి ధరలు ఊహించని విధంగా పెరిగిపోతున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఎండు మిర్చి తేజ



రకానికి రికార్డు స్థాయిలో ధర పలికింది. గురువారం ఉదయం జెండాపాట సమాయానికి వివిధ జిల్లాల నుంచి 26 వేల బస్తాల మిర్చిని రైతులు యార్డుకు తీసుకొచ్చారు. అనంతరం జరిగిన జెండాపాటలో క్వింటాకు గరిష్ఠ ధర రూ.23 వేలు పలికింది. మధ్య ధర క్వింటాకు రూ.20,900 కాగా, కనిష్ఠ ధర క్వింటాకు రూ18,300 చొప్పున వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. తాలు రకం పంటకు క్వింటా రూ.14 వేలు పలికింది. యార్డులో జెండాపాట నిర్వహణ, క్రయవిక్రయాల తీరును చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, సెక్రటరీ ఆర్ మల్లేశం పరిశీలించారు. రాబోయే కొద్ది రోజుల్లోనే యార్డులో క్వింటా మిర్చి ధర రూ.25 వేలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ వ్యాపారులు వెల్లడించారు.

# పేపర్ లీకేజీలో పెద్దల హస్తం: కాంగ్రెస్

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో పెద్దల హస్తం ఉందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. కింది స్థాయి ఉద్యోగులను బలిచేసి పెద్దలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలి పారు. నిరుద్యోగుల పోరాటం వల్ల వచ్చిన తెలంగాణలో ఉద్యోగాలను అమ్మకాలకు పెడుతున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వచ్చినప్పటి నుంచి జరిగిన అన్ని ఉద్యోగ నియామకాలపైనా సిట్టింగ్‌జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

# ఢిల్లీలో బిఆర్ఎస్ శ్రేణుల మోహరింపు

### కవిత అరెస్ట్ చేస్తారన్న సమాచారంతో రాక

### అరెస్ట్ చేస్తే ఆందోళనలకు సిద్ధంగా గులాబీ సేన

**న్యూఢిల్లీ,మార్చి16(ప్రజామంటలు):** ఇడి ముందుకు గురువారం విచారణకు వస్తే కవితను అరెస్ట్ చేస్తారన్న సమాచారంతో బిఆర్ఎస్ శ్రేణులు ఢిల్లీ చేరుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితపై ఈడీ, కేంద్ర ప్రభుత్వం తీరును బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు, పార్టీ నేతలు ఖండించారు. ఈడీ విచారణ నేపథ్యంలో కవితకు మద్దతుగా నిలబడేందుకు



బీఆర్ఎస్ కార్యకర్తలు, జాగృతి నాయకులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలోని కెసిఆర్ నివాసం వద్దకు చేరుకుని కవితకు అండగా నిలబడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితపై ఈడీ దాడిని దుర్మార్గపు చర్యగా బీఆర్ఎస్ నేతలు అభివర్ణించారు. కేవలం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఈడీని అడ్డుపెట్టుకుని ఈ దాడులకు పాల్పడుతోందని విమర్శిస్తు న్నారు. తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబంపై బీజేపీ కక్ష కట్టిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. ఈడీ దాడులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని కబ్జా చేయాలని చూస్తోందని అన్నారు. బీజేపీ వ్యతిరేక నాయకుల మీద మాత్రమే దాడులు చేస్తున్నారని.. బీజేపీ నాయకులపై ఎందుకు ఈడీ దాడులు జరగట్లేదని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును దోచుకెళ్లిన ఆదానీపై ఎందుకు దాడి చేయట్లేదని.. కవితపైనే ఎందుకు దాడి చేస్తున్నారని నిలదీశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కవితకు మద్దతుగా ఉంటామని ప్రకటించారు. పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పటి నుంచి తమ పార్టీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని గువ్వల బాలరాజు అన్నారు. ముఖ్యంగా కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితపై సీబీఐ, ఈడీ అంటూ రకరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కవిత ఎలాంటి స్కామ్ చేయలేదని.. కేవలం కేసీఆర్ బలగాన్ని దెబ్బతీయాలనే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశ విలువలు కాపాడాలనే కదం తొక్కుతూ ముందుకెళ్తున్న కేసీఆర్‌ను తెలంగాణకే పరిమితం చేయాలనే కుట్రలు పన్నుతోందని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న పాలన విధానాన్ని దేశానికి పరిచయం చేస్తే తమ ఉనికికే ప్రమాదమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అందుకే తమ దుర్మార్గపు ఆలోచనలతో ప్రజాస్వామ్యాన్ని అంతమొందించడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం గద్దె దిగేంతవరకు ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. స్వయంప్రతిపత్తితో పనిచేయాల్సిన ఈడీ, సీబీఐ వంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పనిచేసే విధంగా మారుస్తు న్నారని విమర్శించారు. దీన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో కవితకే కాదు.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న నాయకులను ఇటువంటి దాడులకు పూనుకున్న ప్రభుత్వాన్ని అంతమొం దించాలని పిలుపునిచ్చారు. మోదీ హయాంలో దేశంలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై బీజేపీ కుట్ర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. కేసీఆర్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేందుకే బీజేపీ కుట్రలు పన్నుతోందని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కార్ దుర్వినియోగం చేస్తోందని బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర ఆరోపించారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా భయపడేది లేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌పై బీజేపీ కుట్రలు సాగవని అన్నారు.

# వేధింపులపై తక్షణం స్పందించాలి

### వందకు డయల్ చేస్తే తక్షణ సహాయం

**హైదరాబాద్, మార్చి 16 (ప్రజామంటలు):** వేధింపులు, ఈవ్ టీజింగ్ బారిన పడుతున్న వారిలో చాలామంది ఆలస్యంగా ఫిర్యాదు చేస్తుండడంతో సాక్షాలు తారుమారు అవుతున్నా




యని పోలీసులు అంటున్నారు. దీంతో కేసుల దర్యాప్తులో ఆలస్యం జరుగుతోంది. తక్షణం స్పందించేలా ప్రతి ఒక్కరూ అవ గాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఆకతాయిలు, పోకిరీలు వేధిస్తున్నప్పుడు డయల్ 100కు ఫోన్‌చేస్తే పది నిమిషాల్లో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారు. ఈవ్‌టీజర్లను పట్టుకుని వెళ్తారు. గతంలో బాధితులు ఫోన్ చేయకుండా 'షి' బృందానికి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, వృత్తివిద్య కళాశాలలు, బస్‌స్టాపులు, బస్సు లోపల, వాణిజ్య సముదాయాలు, ఉద్యానవనాలు, దేవాలయాల, మల్టీప్లెక్స్‌ల దగ్గర ఈవ్‌టీజింగ్ కొనసాగుతోంది. యువతులు, విద్యార్థినులు ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళుంటే వారి వెంటపడి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అప్పటి కప్పుడే బాధితులు స్పందిస్తే పోలీసులకు సంఘటనా స్థలాల్లోనే సాక్ష్యాధారాలు లభిస్తాయి. ఆలస్యంగా ఫిర్యాదు చేస్తే ఆకతాయిలు, పోకిరీల జాడ కనిపెట్టాలి. వారు సంఘటన స్థలంలో ఉన్నట్టు సాక్ష్యాధారాలు సేకరించాలి, దీంతోపాటు మళ్లీ విచారణ పక్రియ మొదలు పెట్టాలంటే రెండు, మూడు రోజులు పడుతుందని 'షి'బృందం బాధ్యులు తెలిపారు. కాలనీలు, జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వెళ్తుంటే ద్విచక్ర వాహనాలపై వేగంగా వారిపైకి దూసుకొచ్చేలా చేసి భయపెడుతున్నారు. బస్‌స్టాపుల్లో బస్సు ఎక్కే మహిళలు, యువతులను అనుసరించి వారి శరీరాలను తాకేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు యువకులైతే బస్సుల్లో పరోక్షంగా యువతులను ఉద్దేశించి బూతులు మాట్లాడుతున్నారు.

# దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన బీజేపీ నాయకురాలు సురేఖ గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్శితులై ప్రజలతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారని ఆయన అన్నారు. దీంతో ఆయా పార్టీలకు కార్యకర్తలు కరువవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తున్నదన్నారు. రాష్ట్రంలో అమలవు తున్న కల్యాణలక్ష్మి, దళిత బంధు, కేసీఆర్ కిట్, కంటివెలుగు సహా ఎన్నో పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈపథకాల అమలుకు



ప్రజల నుంచి డిమాండ్‌లు వస్తుండటం సీఎం కేసీఆర్ దక్షతకు నిదర్శమన్నారు. కొత్తగా పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ తగు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పార్టీ పటిష్టత కోసం పాటుపడే వారికి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్‌లకు చెందిన వారికి అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం మంజూరైన రూ. 21,71,000 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తున్నదన్నారు. పేదరికంతో అనారోగ్యాలతో బాధపడే వారికి ఈ పథకం ఆర్థిక సాయంతో కార్పొరేట్ వైద్యంతో స్వస్థతను పొందుతున్నారన్నారు. దరఖాస్తుదారులకు వీలైనంత త్వరగా సహాయం అందేలా తాను కృషి చేస్తున్నట్లు విప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, చంద్రకాంత్‌రావు, చంద్రారెడ్డి, చంద్ర మోహన్ సాగర్ పాల్గొన్నారు.

# దోపిడీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా

### ఏడుగురు నిందితుల అరెస్ట్

**నల్లగొండ,మార్చి16(ప్రజామంటలు):** దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడుగురు నిందితుల్ని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక కారు, 35 సెల్ ఫోన్లు, కత్తి, రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అపూర్వరావు గురువారం ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. గురువారం పానగల్లు బైపాస్ వద్ద టూ టౌన్ ఎస్ఐ , సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా మారుతి కారులో ఉన్న వ్యక్తులు పోలీసులను చూసి మిర్యాలగూడ వైపునకు పారిపోయారని తెలిపారు. పోలీసులు కారును వెంబడించి పట్టుకోగా కారులో ఉన్న ఏడుగురు నిందితులను, ఇనుపరాడ్ ,కత్తితో పాటు 39 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నెల 8న నల్లగొండ మండలం దండెంపల్లి గోశాల వద్ద డీసీఎంను ఆపి డ్రైవర్ శ్రీనివాస్ పడుకున్నాడు. కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి రాడ్ తో కొట్టి అతడిని గాయపర్చి సెల్ ఫోన్ రూ. 1500 దొంగిలించి పారిపోయారని తెలిపారు. శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టామని ఆమె తెలిపారు. ల్గ÷దరాబాద్ మాదన్నపేట్ కు చెందిన ఆటో డ్రైవర్ ఉబది అరవింద్, విఘ్నేశ్ అలియాస్ విక్కీ, నల్లగొండ జిల్లా యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన కడమంచి గణెశిశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అదేవిధంగా మిర్యాలగూడ కు చెందిన కరమంచి శ్రీహరి, నల్లగొండ జిల్లా నిడమనూర్ మండలం జంగాలవారి గూడెంకు చెందిన ఆలేటి వెంకటయ్యతో పాటు మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేశామన్నారు.వీరంతా మద్యానికి బానిసై యాదగిరిగుట్ట, హాయత్ నగర్, ఎల్‌బీ నగర్, చౌటుప్పల్, నార్కట్‌పల్లి, నల్గండ తదితర ప్రాంతాలలో జాతీయ రహదారులపై దారి దోపిడీలకు పాల్పడుతున్నారని ఆమె వివరించారు. మీడియా సమావేశంలో నల్గండ డీఎస్‌పీ వి. నరసింహ రెడ్డి, నల్గండ టూ టౌన్ సీఐ డి.చంద్రశేఖర్ రెడ్డి , నల్గండ ట్రాఫిక్ సీఐ శ్రీను, ఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, కానిస్టేబుళ్లు శంకర్, బాలకోటి , గాంధీ , వెంకన్నలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# కేసీఆర్ కుటుంబంలో మొదటి వికెట్ కూతురు కవిత

### తర్వాత కొడుకు, అల్లుడే ఉన్నారన్న విజయశాంతి

**హైదరాబాద్,మార్చి16(ప్రజామంటలు):** కేసీఆర్ కుటుంబంలో మొదటి వికెట్ కూతురు కవిత నుండే ప్రారంభమైందని.. తర్వాత కొడుకు, అల్లుడే ఉన్నారని బీజేపీ మహిళ నేత విజయశాంతి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళకు రక్షణ లేదని విజయశాంతి విమర్శించారు. పామ్ హౌస్‌లో ఉంటూ సీఎం కేసీఆర్ 4లక్షల రూపాయల తీసుకుం టాడు.. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడని ఆరోపించారు. హైదరాబాద్ వనస్థలిపురంలో మహిళ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆమె..మహిళకు మెతక వైఖరి పనికిరాదని..దృఢంగా ఉండాలని సూచించారు.అధికార పార్టీ మహిళ సర్పంచ్ పట్ల అసభ్యంగా మాట్లాడిన ఓ ఎమ్మెల్యే పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ డాన్ అని వ్యాఖ్యానించారు కవిత. కవితను ఈడీ, సీబీఐ లు



పిలుస్తే వెళ్లరు, తప్పు చేసి మహిళ అని తప్పించు కుందాం అనుకుంటున్నారని విజయశాంతి ఫైర్ అయ్యారు. కేసీఆర్ కుటుంబం మొత్తం క్రిమినల్ మైండ్ ఉన్న నాయకులే అని ఆరోపించారు. గంజాయి, డ్రగ్స్ కు ఈ రాష్ట్రం అడ్డాగా తయారు అయిందని తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా మహిళలను వదలకుండా వేధిస్తున్నారు. ఏనాడైనా సీఎం కేసీఆర్ మహిళలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేశాడా అని ప్రశ్నించారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా కేసీఆర్ ఇదే విధంగా చలనం లేకుండా ఉంటున్నాడని వ్యాఖ్యానించారు. అవసరానికి పని చేయించుకొని అవతలికి పొమ్మంటడు కేసీఆర్.. మహిళలు స్వతంత్రంగా బతికే స్వేచ్ఛను ఇచ్చే విధంగా సీఎం విధానాలు లేవని అన్నారు. కల్వకుంట్ల తండ్రీకొడుకులు మాట్లాడితే చిన్న పిల్లలు టీవీలు చూసే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ కూతురు లిక్కర్ డాన్ గా మారిందని..మహిళలకు ఎక్కడైన లిక్కర్ అనే ఆలోచన వస్తుందా అని నిలదీశారు విజయశాంతి.

# కాపీ కొట్టేందుకు నానా తంటాలు

### చేతులు, చున్నీలపై నకళ్లు

**అనంతపురం,మార్చి16(ప్రజామంటలు):** ఎగ్జామ్స్‌లో టాలెంట్ చూపించాల్సిన పలువురు విద్యార్థులు పెడదోవబట్టారు. పరీక్షల్లో పాసయ్యేందుకు అడ్డదారి తొక్కారు. చేతులపై, చున్నీలపై ఆన్సర్లు రాసుకొచ్చి కాపీ కొట్టేందుకు ప్రయత్నించి దొరికిపోయారు. అనంతపురం జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం పొలిటికల్ సైన్స్ సైకాలజీ, కెమిస్టీ విద్యార్థులకు పేపర్ -1, బీబీఏ, బీసీఏ విద్యార్థులకు పేపర్ -2 పరీక్షలకు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అనంతపురం జిల్లాలోని ఎస్వీ డిగ్రీ కాలేజీ, ఎస్-ఎల్ఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడ్డారు. ఓ విద్యార్థిని చున్నీపై పెన్నుతో సమాధానాలు రాసుకొని వచ్చింది. పలువురు విద్యార్థులు చేతులపై సమాధానాలు రాసుకుని ఫుల్ హ్యాండ్స్ షర్ట్ వేసుకొచ్చారు. అయితే విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడటం గమనించిన ఇన్విజిలెటర్లు వాళ్లను పట్టుకున్నారు. ఆయా విద్యార్థులను డిబార్ చేశారు. అనంతపురంలో ఐదుగురు, తాడిపత్రిలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ వెల్లడించారు.



## కరాటేలో స్వర్ణ పతకం సాధించిన
# లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి

**కోరుట్ల మార్చ్ 16 (ప్రజామంటలు):** వేములవాడలో జరిగిన 3వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2023 ఒకినావ మార్షయల్ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో కోరుట్ల పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ 6 వ తరగతి విద్యార్థి సంకు రిషికేశ్ స్వర్ణ పతకం సాధించడం జరిగినది.




కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ తుమ్మనపెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.... పిల్లలకు విద్యతో పాటు వారి మానసిక ఉల్లాసానికి మరియు ఆత్మరక్షణకు కరాటే లాంటి కార్యక్రమాలు దోహద పడతాయని తెలిపారు. స్వర్ణ పతకం సాధించిన సంకు రిషికేశ్, కోచ్ అల్లె రమేష్ ను సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సిరికొండ గంగాధర్, తుమ్మనపెల్లి మనోజ్ కుమార్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రభుత్వ
# విద్యాసంస్థలకు నూతన భవనాలు

**డిప్యూటి స్పీకర్ పద్మారావు గౌడ్**

**సికింద్రాబాద్, మార్చి 16 ( ప్రజామంటలు ):**సీతాఫలమండీ ప్రభుత్వ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలకు కొత్త భవన సముదాయాలు నిర్మించే పనులను త్వరలో



ప్రారంభిస్తామని ఉప సభాపతి తీగుల్ల పద్మారావు గౌడ్ వెల్లడించారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను ముఖ్యమంత్రి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి పద్మారావు గౌడ్ సాధించిన నేపద్యంలో కొత్త భవనాల నిర్మాణానికి వీలుగా పాత భవనాల కూల్చివేత పనులను అధికారులు చేపట్టారు. ఈ పనులను పద్మారావు గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త భవనాల నిర్మాణం పనులను వీలైనంట్ త్వరగా ప్రారంభించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని, కొత్త భవనాలను మోడల్ గా తీర్చిదిద్దాలని అయన సూచించారు.

## డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్
# ప్రెసిడెంట్‌గా పార్శీ మహేశ్

**సికింద్రాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ బన్సీలాల్ పేట్ డివిజన్ అధ్యక్షుడి గా పార్సి మహేష్ ను నియమిస్తూ హైదరాబాద్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్



అచ్యుత రమేశ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గత 21 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి డివిజన్ ప్రెసిడెంట్ పదవిని ఇచ్చిన పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్ బట్టి విక్రమార్క, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అనిత్ యాదవ్, రమేశ్ బాబు, చంద్రశేఖర్ లకు పార్శీ మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ వైస్ చైర్మన్ ఐత చిరంజీవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేపర్ల లీకేజీపై బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ

**మెంబర్ గా మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి**

**సికింద్రాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** టీ.ఎస్.పీ.ఎస్.సీ. ప్రశ్నపత్రాల లీకేజీపై నిజాలను నిగ్గు తేల్చేందుకు గాను 9 మంది సభ్యులతో కూడిన ఓ టాస్క్ ఫోర్స్ కమిటీని భారతీయ జనతా పార్టీ నియమించింది. టీ.ఎస్.పీ.ఎస్.సీ. మాజీ సభ్యుడు విఠల్ ఈ కమిటీకి కన్వీనర్ గా వ్యవహరించనున్నారు. మాజీ మంత్రి, మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ చంద్రవదన్, రిటైర్డ్ ఐపీఎస్ కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు దుగ్యాల ప్రదీప్, ఎస్. కుమార్, కరుణ గోపాల్ సభ్యులుగా ఉన్నారు.



# రక్త దానమే ప్రాణదానము

◆ **సర్పంచ్ శ్రీమూర్తి**

**చిగురుమామిడి మార్చి 16 ( ప్రజా మంటలు):** కార్స్ అడ్డా కరీంనగర్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.... ఒకరు రక్తదానం చేయడం వల్ల అది వేరొకరికి ప్రాణదానం అవుతుందని అన్నారు. మారుతున్న కాలం దృష్ట్యా అనేక ఆరోగ్య సమస్యల వల్ల ఆక్సిడెంట్ల వల్ల ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం అయినప్పుడు బ్లడ్ బ్యాంక్ ల ద్వారా రక్తాన్ని అందించడం జరుగుతుందని ముఖ్యంగా యువత రక్తదానం చేయడం ద్వారా బ్లడ్ బ్యాంకులలో తగినంత రక్తం ఉండటం వల్ల ఆపదలో అవసరం అయినప్పుడు వెంటనే వారికి అందించవచ్చని అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో చాలామంది ఇమ్యూనిటీ పవర్ లేక ఇబ్బందులు పడ్డ దృష్ట్యా వారికి రక్త నిల్వలు అవసరం అవుతున్నాయని ప్రస్తుత రోజుల్లో బ్లడ్ బ్యాంకుల్లో కూడా తాగినంత రక్త నిల్వలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి సమయంలో కార్స్ అడ్డ కరీంనగర్ యూట్యూబ్ ఛానల్ వారు కేవలం వ్యాపార వృత్తినే కాకుండా సేవా దృక్పథం కొద్దీ యువతను ముందుకు నడిపించే విధంగా వారి ద్వారా రక్తదానం శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. మరో ముఖ్య అతిథి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి రక్తము అత్యవసర సమయంలో అవసరం ఉన్నప్పుడు ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఎంతగానో తోడ్పడుతుందని యువత రక్తదాన శిబిరంలో విరివిగా పాల్గొని రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్స్ అడ్డా కరీంనగర్ నిర్వాహకులు శ్రీ





మూర్తి సతీష్ , బాకం ఆదర్శ్ వార్డు సభ్యులు కంది శంకర్, నాంపల్లి కొమురయ్య, నవీన్, రాజు, పోలోజు సంతోష్, మహేందర్ తో పాటు రెడ్ క్రాస్ సొసైటీ లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ విధులపై శిక్షణ కార్యక్రమం

**మహాదేవపూర్ మార్చి 16 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో గ్రామస్థాయిలో స్వచ్ఛ భారత్ మిషన్ విధులు రెండవ దశ అమలుపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సర్పంచ్ శ్రీపతి బాపు అధ్యక్షతన ప్రారంభమైంది. మహాదేవపూర్ పలిమేల రెండు మండలాల స్థాయిలో జరిగిన మొదటి రోజు శిక్షణా తరగతులకు స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ మంద వెంకటేష్ హాజరైనారు గ్రామస్థాయిలో పరిశుద్యంపై చేయవలసిన వివిధ కార్యక్రమాలు ఓడిఎఫ్ ప్లస్ గ్రామాల గురించి వివరించారు.



సుస్థిరమైన పారిశుద్ధ్యం నిర్వహణ పద్ధతులు వ్యర్థాల నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట హానికరమైన వ్యర్థాలను నిర్వీర్యం చేయుట తడి చెత్త నుండి సేంద్రియ ఎరువుల తయారీ డంపింగ్ యార్డుల నిర్వహణ గ్రామ పారిశుద్ధ్య ప్రాణాలిక గురించి సాంకేతిక అధికారి నాగేందర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి. రాణి బాయి, జడ్పిటిసి గుడాల అరుణ, ఎంపీఓ ప్రసాద్, సర్పంచులు పంచాయితీ కార్యదర్శులు, ఈజిఎస్ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తారా కెమికల్ ఇండస్ట్రీస్ ముందు
# ఖిలాషాపురం గ్రామస్తుల ఆందోళన

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో తారా కెమికల్ ఇండస్ట్రీస్ ముందు పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కెమికల్ కంపెనీ పనులను నిలిపివేయాలని గతంలో కంపెనీ నుండి వెలువడే వాయువు వేసినా పండడం లేదు, బోర్లలో నీళ్ళు కలిషిత మయ్యి కెమికల్ వాసన వచ్చి త్రాగడానికి కూడా పనికి రావడంలేదని, ఫ్యాక్టరీ తెరిస్తే వ్యవసాయ భూములతో పాటు గ్రామాన్ని కూడా వదిలి వెళ్లే పరిస్థితి వస్తుందని రైతులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై



వల్ల గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. పక్కనే ఉన్న కస్తూర్బా గాందీ పాటశాల విద్యార్థినులు కూడా ఇబ్బందులు పడడమే కాకుండా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. కంపెనీ చుట్టూ పక్కల అరకిలోమీటర్ వరకు ఉన్న వ్యవసాయ పంట భూములలో పంటలు రాకుండా, బోరుబావుల నీరు త్రాగడానికి కూడా వీలులేకుండా పోయింది ,కంపెనీ దగ్ధం అయ్యి మూడు సంవత్సరాలు గడుస్తున్న కూడా అ చుట్టూ పక్కల ఇంకా చెడు వాసనలు వస్తున్నాయి.ప్యాక్టరీ చుట్టుప్రక్కల కిలోమీటర్ దూరం వరకు వ్యవసాయం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఏ పంట ఖిలాషాపూర్ గ్రామస్తులు జిల్లాకలెక్టర్ శివలింగయ్య కు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, యంపిటిసి అల్లిబిల్లి కృష్ణ, జిట్టే వీరస్వామి, కావటి యాదగిరి, యామంకి సుధాకర్, పెంతల మైపాల్, అల్లపు నరసయ్య, శివరాత్రి యాదగిరి, సిద్ధులు, పెంతల చంద్రయ్య, కత్తి పద్మ, జిట్టే శోభ, గాదె కల్పన, ఎండి ఫెరోస్, అజీస్, బాల్నే రవి, ఆవుదొడ్డి మహేష్, పెంతల భాగ్య, బండ మీద శోభ, ప్రమీల, రాజమ్మ యాదమ్మ, ముప్పిడి సరూప, మీసాల యాకమ్మ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై మళ్లీ
# విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు వినతి

**నర్మెట మార్చి 16 (ప్రజామంటలు):** మండలంలోని వెల్దండ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు చేస్తున్నారని సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అన్నారు. గురువారం రోజున సిపిఎం ఆధ్వర్యంలో వెల్దండ గ్రామ అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలతో కలిసి జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్య కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుంచు విజేందర్ మాట్లాడుతూ వెల్దండ గ్రామంలో ఇండ్లులేని నిరుపేదలకు కాకుండా వ్యవసాయ భూములు ట్రాక్టర్లు కలిగిన వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం దారుణం. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధన ప్రకారం జరగలేదన్నారు. నిబంధనను ఉల్లంఘించి గ్రామసభ జరిపారని అందులో అర్హత లేని వారిని లబ్ధిదారుల గుర్తించారన్నారు. ఇప్పటికైనా అధికారులు అనర్హులతో కూడిన జాబితాను రద్దుచేసి మళ్లీ రీ సర్వే నిర్వహించి నిజమైన అర్హుల జాబితాని ప్రకటించాలని దాని తర్వాతనే డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ నిర్వహించాలని వారు కలెక్టర్ ని కోరారు. నర్మెట్ట మండల తాసిల్దార్ శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు తొత్తుగా మారి ఎమ్మెల్యే గెస్ట్ హౌస్ వద్ద అనర్హులకు ఇండ్ల పట్టాలు,



ఇండ్ల తాళాలు ఇవ్వడం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. కావున అధికార దుర్వినియోగానికి పాల్పడిన నర్మెట్ట మండల తహసిల్దార్ శ్రీనివాస్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు రాధిక కొమురయ్య, సావిత్రి, అనిత, ఏల్లమ్మ, కళావతి సత్తయ్య రవి పాల్గొన్నారు.

# ఎస్సై సుధాకర్ జన్మదిన వేడుకలు

**విద్యార్థులకు బుక్కులు పంపిణీ చేసిన యువకులు**

**చిగురుమామిడి మార్చి 16 (ప్రజామంటలు):** చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం మండలంలోని ఇందుర్తి ప్రాథమిక



పాఠశాలలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న 85 మంది విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేసిన ఇందుర్తి గ్రామ యువకులు చిన్నారుల మధ్య ఎస్ఐ సుధాకర్ జన్మదిన వేడుకలను సీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. సందర్భంగా లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని ఎస్సై జన్మదిన సందర్భంగా మండలంలోని 10వ తరగతి చదువుతున్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు వివిధ రకాల సామాగ్రితో కూడిన బాక్స్ ఎస్.ఐ. సొంత ఖర్చులతో అందజేయడం అభినందనీయమని తెలిపారు ఈ కార్యక్రమంలో యువకులు సొన్నాయిల భరత్, చెప్పాల ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలు

**పద్మారావునగర్‌లో బీజేపీ వర్క్షాప్**

**సికింద్రాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత బూత్ స్థాయి



కార్యకర్తలదే నని సికింద్రాబాద్ పార్లమెంటరీ పార్టీ ఇంచార్జీ టి. రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం పద్మారావునగర్ లో సనత్ నగర్ నియోజకవర్గ స్థాయి పోలింగ్ బూత్ స్వశక్తి కరణ్ అభ్యాసనపై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ మోర్చా సెక్రటరీ గోలి మధుసూదన్ రెడ్డి, జిల్లా పార్టీ ప్రెసిడెంట్ శ్యాంసుందర్, జిల్లా నాయకులు పెద్ది రవీందర్, హరినాథ్, అల్లబోయిన ఆనంద్ యాదవ్, ఎల్లకొండ శ్రీనివాస్, సురేశ్, రాజు, బీజేపీ కార్పొరేటర్లు సుచిత్ర, కె. సునీత, సరళ, నాగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన
# జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి

**ఎల్కతుర్తి మార్చి 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని పలు అభివృద్ధి పనులు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి పనులు ఎలా జరుగుతున్నాయని సర్పంచ్ నిరంజన్ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్వర్గధామం నర్సరీ పల్లె ప్రగతి పనులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఎల్కతుర్తి లోని ఒక డీలర్ రేషన్ షాపులు తనిఖీ చేశారు. అలాగే కంటి వెలుగు ప్రోగ్రాం అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ



కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు సర్పంచి నిరంజన్ రెడ్డి, ఎంపీపీ మేకల స్వప్న తాసిల్దార్ రవీందర్ రెడ్డి, ఎండిఓ సునీత, ఎంపీ ఓ అనిత, సర్పంచులు రజిత దేవేందర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి, హెడ్మాస్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఇక్బాల్ హైమద్, ఏఎన్ఎం ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారం సేవాజ్యోతి
# అవార్డ్ అందుకున్న జేఎస్ఆర్

**భీమదేవరపల్లి మార్చి 16 (ప్రజామంటలు):** హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో తెలంగాణ మహిళా సేన సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషిచేసి సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందించారు. అందులో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం నుండి బిజెపి నాయకులు వృక్ష ప్రసాద దాత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డికి సేవాజ్యోతి పురస్కారంతో వారిని ఘనంగా సన్మానించారు.



## పదవ తరగతి పరీక్షలపై శిక్షణా శిబిరం

**హన్మకొండ మార్చి 16 ( ప్రజామంటలు) :** హన్మకొండ జిల్లాలో ఏప్రిల్ 03 వ తేదీ నుండి 13 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి కామన్ పరీక్షల నిర్వహణ గురించి పరీక్షల నిర్వహణ అధికారి చలపతి రావు అధ్యక్షతన, జిల్లా విద్యాశాఖ





అధికారి అబ్దుల్ హై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణ గురించి సూపరింటెండెంటెంట్స్, చీఫ్ సెక్రటరీస్ మరియు డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ లకు పరీక్షల నిర్వహణ గురించి నియమ నిబంధనలు తెలియజేశారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పరీక్షలను సమర్ధవంతంగా జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ఏ శ్రీనివాస్, బి. రమేష్ పాల్గొన్నారు.

## కనకంకు “కళాజ్యోతి” పురస్కారం అందజేసిన జెఎస్ఆర్

**భీమదేవరపల్లి మార్చి 16 (ప్రజామంటలు):** మండలంలోని మంగళపల్లికి



చెందిన ప్రముఖ సినీ కళాకారుడు కనకం వెంకట్ కు తెలంగాణ రాష్ట్ర మహిళా సేన సేవా సమితి వారు “కళాజ్యోతి” అవార్డుతో సత్కరించారు. హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన ఉగాది పురస్కారంలో భాగంగా వెంకట్ కళారంగంలో చూపిస్తున్న ప్రతిభను గుర్తించి ప్రముఖ సామాజిక సేవకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్యాలక్ష్మి తదితరులు అందజేశారు. కాగా వెంకట్ కు అవార్డు రావడం పట్ల పలువురు కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## గూడ్స్ వెహికల్స్ నిర్వాహకులకు అండగా ఉంటాం

**మంత్రి తలసాని**

**సికింద్రాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** గూడ్స్ వెహికల్స్ నిర్వహకులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్ పేట డివిజన్ రాణిగంజ్ లో నిర్వహించిన మినీ గూడ్స్ వెహికల్స్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... వాహనదారులు, ప్రజల ఇబ్బందులను ఆలోచించకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ వాహన చట్టాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. పేద, మద్య తరగతి ప్రజలు ఈ వాహనాలను నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. మీకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ ను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 25 సంవత్సరాల నుండి యూనియన్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులకు మంత్రి అభినందనలు తెలిపారు. స్థానిక వ్యాపారులతో స్నేహ, సోదరభావంతో మెలగాలని చెప్పారు. ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి క్రింద పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సహాయం పంపిణీ, వృద్దులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ లు అందించడం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, బీ.ఆర్.ఎస్. పార్టీ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, జహంగీర్, రాజు, మహేష్, ప్రేం కుమార్, రాఘవేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

**నిమిషం నిబంధనతో గంట ముందే సెంటర్‌కు స్టూడెంట్స్**

**సికింద్రాబాద్ మార్చి 16 (ప్రజామంటలు):** ఇంటర్మీడియట్ రెండో సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం నిబంధనతో ఆందోళనలో ఉన్న స్టూడెంట్స్ ఎగ్జామ్ సెంటర్స్ కు గంట




ముందుగా 8 గంటలకే చేరుకోవడం కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాస్ కాపీయింగ్ కు అవకాశం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. స్టూడెంట్స్ వెంట వాళ్ళ ప్యారెంట్స్ వచ్చి తమ పిల్లలను ఎగ్జామ్ సెంటర్ లోకి పంపించి, వెళ్ళిపోయారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపద్యంలో స్టూడెంట్స్ తమ, తమ ఎగ్జామ్ సెంటర్స్ కు సకాలంలో చేరుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బలిదానాలతో రాష్ట్రం వచ్చినా పేపర్ లీకేజీలతో బాధలు తప్పడం లేదు

- **టి.యస్.పి.యస్.సి బోర్డు ఛైర్మెన్‌ను సస్పెండ్ చెయ్యాలి**

**గొల్లపల్లి మార్చి 16 (ప్రజామంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని డీసీసీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో, గురువారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నిరసన వ్యక్తం చేస్తూ, రోడ్డుపై బైఠాయించి ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన డిసిసి జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... మన తెలంగాణ మనకు వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత బలిదానాలు చేసుకుంటే ఈ పేపర్ లీకేజీ చాలా దౌర్భాగ్యకరం, నిరుద్యోగ యువత అనేక ఇబ్బందులు పడుతూ ఉద్యోగాల సాధనకోసం వేల రూపాయలు ఖర్చు చేసి సిద్ధం అవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీలు చేస్తూ తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట పడి రాత్రి పగలు చదివిన పేద మధ్య తరుగతి నిరుద్యోగుల పాలిట కేసీఆర్ పాలనా శాపం అయింది, ఎనభై శాతం బలహీన వర్గాలకు చెందిన వారు ఉద్యోగుల కోసం చూస్తుంటే పేపర్ లీకేజీ పై నోరుమేధపడం లేదు. ఈ సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టి.యస్.పి.యస్.సి బోర్డు ఛైర్మెన్ బి జనార్ధన్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, బోర్డుని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో జరిగే పరీక్షలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా జరిపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు రేవల్ల సత్య నాయణ గౌడ్, సరసాని తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ ఉప సర్పంచ్ లు కొండ వెంకటేష్ గౌడ్, హరి, కిరణ్, శ్రీధర్, సీనియర్






నాయకులు రాజారావు రామగౌడ్, రామ్ మోహన్ రెడ్డి, కొమురయ్య, గంగధర్, రమేష్, విజయ్, సత్తయ్య, దిలీప్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నేరళ్ల మహేష్, , తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం


**భీమదేవరపల్లి మార్చి 16 (ప్రజామంటలు):** మండలంలోని విశ్వనాథ కాలనీ గ్రామంలో గురువారం బొడ్రాయి ఉత్సవ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 16







నుండి 18 వరకు విశ్వనాథ కాలనీ గ్రామంలో గ్రామదేవతలైన నాభిశిల, పోచమ్మ, హనుమాన్ నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం జలాధి వాసము, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, మాతృకారాధన దేవనాంది, పంచ గావ్య ప్రాసనం, రక్షాబంధనము, అగ్ని మతనం, యాగశాల ప్రవేశము, షోడశ స్తంభ ఆవాహనము, అగ్ని కుండ సంస్కారం, సర్వతో భద్ర మండలం, శతుశష్టి పూజ, వాస్తు మండపారాధన, క్షేత్రపాలక మండపారాధన, కలశారాధన







కార్యక్రమాలు వేద పండితులు నాగిల్ల కృష్ణమూర్తి శర్మ, సాయి చరణ్ శర్మ, మామిళ్ళపల్లి సాయి రాజేష్, చక్రచారి, నేతృత్వంలో మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు గ్రామ సర్పంచ్ వల్లపు అనిత రమేష్ తెలియజేశారు.

## నిర్ధిష్ట సమయంలో చిట్ ఫండ్ ఖాతాదారులకు చెల్లింపులు జరపాలి: సీపీ

**హన్మకొండ మార్చి 16 ( ప్రజా మంటలు) :** వరంగల్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చిటఫండ్ సంస్థలకు చెందిన యాజమాన్యంతో గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ముందుగా చిట్ ఫండ్ సంస్థలు ఎంతమంది చిట్ ఫండ్ ఖాతాదారులకు చెల్లింపులు వున్నాయి. అలాగే గతంలో చిట్ ఫండ్ సంస్థలపై నమోదయిన కేసుల్లో ఎంత మంది బాధితులకు చిట్ ఫండ్ యాజమాన్యం చెల్లింపులు. జరిపాయని పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగితెలుసుకున్నారు. అలాగే అత్యధికంగా చెల్లింపులు చేయాల్సిన చిట్ ఫండ్ సంస్థల వివరాలను పోలీస్ కమిషనర్ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఖాతాదారులకు డబ్బు చెల్లింపు చిట్ ఫండ్ సంస్థలు చేస్తున్న ఆలస్యంకు గల కారణాలను కూడా పోలీస్ కమిషనర్ చిట్ ఫండ్ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ చిట్ ఫండ్ ఖాతాదారుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందు కోసం చిట్ ఫండ్ కంపెనీలు ఎంత మంది ఖాతాదారులకు ఎంత మొత్తంలో చెల్లించాల్సి వుంది. అలాగే ఖాతాదారుల నుండి చిట్ ఫండ్ ఖాతాదారుల నుండి రావాల్సిన మొత్తానికి సంబంధించిన చిట్ ఫండ్ కంపెనీల వారిగా వివరాలను సేకరించి సంబంధిత పోలీస్ అధికారులకు అందజేయాలని ఈ సమాచారంతో వచ్చే మంగళవారం రోజున చిట్ ఫండ్ కంపెనీ యాజమానులతో మరోమారు సమావేశాన్ని నిర్వహించి చిటిఫండ్ బాధితులకు న్యాయం అందించే దిశగా తగు చర్యలు తీసుకోబడుతాయని. ఇందులో భాగంగా చిట్ ఫండ్ కంపెనీలు డబ్బు చెల్లించించాల్సిన ఖాతాదారులకు సంబంధించి చిట్ ఫండ్ సంస్థలు అందజేసిన





వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ వెబ్ సైట్లో వుంచబడుతుందని. చిట్ ఫండ్ సంస్థలు ఇచ్చిన సమాచారంలోని బాధితులు కాకుండా మరే ఇతర బాధితులు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున సంస్థలు ఖచ్చితమైన సమాచారాన్ని అందజేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో డిసిపిలు యం.ఏ. బారీ, మురళీధర్, అదనపు డిసిపి పుష్పా రెడ్డి చిట్స్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

**జగిత్యాల మార్చి 16 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని 15 వార్డులో గల భీరయ్య గుడి వద్ద గల అంగన్వాడి సెంటర్ లో గురువారం స్థానిక వార్డు కౌన్సిలర్ తోట మల్లికార్జున్ చేతుల మీదుగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించడంతో పాటు పౌష్టికాహారం తీసుకొని వారికి జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం చిన్నారులు, మహిళలకు చేతులు శుభ్రపరచుకునే విధానం గురించి వివరించడంతో పాటు సబ్బుతో చేతులు శుభ్రపరచుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మాధవి, ఆర్పి లావణ్య, అంగన్వాడి ఆయా మాలతి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ కమిటీ ఎన్నిక

**తరిగొప్పుల మార్చి16 (ప్రజామంటలు):** మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వరంలో గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా కావటి సుధాకర్ ఉపాధ్యక్షునిగా భాష



బోయిన సురేష్, నియమించారు. యూత్ అధ్యక్షులుగా తీగుళ్ల బాలరాజు ఉపాధ్యక్షులుగా పండుగ సంపత్, ఎన్నుకోవడం జరిగింది అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ నాపై నమ్మకంతో పార్టీ అధ్యక్ష పదవి అప్పగించి నందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాసాని గాలయ్య పండుగ సాయిలు, నీల రాజు, సంపత్ రెడ్డి, నీల సంపత్ , కనకరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫీ విత్ వాటర్ ఫర్ బర్డ్స్ చాలెంజ్

**జనగామ మార్చి 16 (ప్రజామంటలు):** సెల్ఫీ విత్ వాటర్ ఫర్ బర్డ్స్ చాలెంజ్ ను అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ స్వీకరించారు. పరిసర ప్రాంతాలలో, ఇంటిపైన లేక మీ గోడ పైన ఒకదాంట్లో నీరు ఇంకో దాంట్లో చిరుధాన్యాలను ఆహార గింజలను



పెట్టాలని, ఎన్నో రకాల పక్షులను వాటి ప్రాణాలను కాపాడాలని అన్నారు. వేసవికాలం వచ్చేసింది ఆహారం కోసం గూడు వదిలి ఎండలో ఎగురుతుంటే రెక్కలు అలసి నీరసం వచ్చేస్తుంది దాహంతో గొంతు ఎండిపోతుంది. పక్షి జాతిలో ఎన్నో రకాల పక్షులు నీటి చుక్క దొరకక సోమ్మసిల్లి పడిపోతూ చనిపోతుంటాయి. నీళ్లు ఇచ్చి, ఆహారాన్ని అందించి ప్రాణాలు కాపాడమని కోరారు.

## వైభవంగా ప్రారంభమైన సుదర్శన చక్ర, జయ విజయ ప్రతిష్ట

**మానకొండూరు మార్చి 16 (ప్రజామంటలు):** మండలం లోని స్థానిక పురాతనమైన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజుల ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి. ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో మొదటి రోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అగ్ని



ప్రతిష్ట, మంటపారాధన మూర్తులకు అభిషేకము, జలాధివాసము, మొదలగు కార్యక్రమాలు జరిగినవి.. ఈ కార్యక్రమంలో పండితులు కొదమగుళ్ల వెంకట రమణాచార్యులు, నమిలకొండ రామకృష్ణమాచార్యులు, శేషం నవీన్ కుమార్, తిరువరంగం భరతాచార్యులు మొదలగు పండితులు అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ, జెడ్పిటిసి శేఖర్ గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజు, ఎంపీటీసీ, వాడ్ మెంబర్స్ ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి కమిటీ సభ్యులు శ్రీనివాస్ స్వామి, పరశురాములు, స్థానిక పురోహితులు గౌతమ్ శర్మ, మనోహర్ శర్మ ఆంజనేయ శర్మ వామనకిషన్ శర్మ, శ్రీధర్ శర్మ, మొదలగు గ్రామ పురోహితులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు తీర్థప్రసాదాలు స్వీకరించారు అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.. మూడు రోజులు జరిగే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని. శుక్రవారం రోజున ఉదయం 108 కలశాలతోనే అభిషేకం.. శనివారం మహా పూర్ణాహుతి, శ్రీ శ్రీనివాస కళ్యాణం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుని యొక్క కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# సుమ,రాజీవ్ కనకాల తనయుడి అరంగేట్రం

## హీరోగా వస్తున్న రోషన్ కనకాల



యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కనకాల గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హీరోగా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా రాజీవ్ కనకాల ఆయనకంటూ ప్రత్యేక ఫ్యాన్స్ ను సొంతం చేసుకోగా.. యాంకర్‌గా సుమ చిన్న పిల్లల నుంచి పండు ముసలి వాళ్ల వరకు అభిమానులుగా మార్చుకుంది. అయితే వీరి కుటుంబం నుంచి మరో హీరో సినీ ఇండస్ట్రీ ఎంట్రీ ఇవ్వబోతున్నారు. అతనెవరో కాదు రాజీవ్ సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల. రోషన్ కనకాల హీరోగా మహేశ్వరి మూవీస్ పతాకంపై ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. క్షణం కృష్ణ అండ్ హిస్ లీల.. చిత్రాలతో విజయాల్ని అందుకున్న రవికాంత్ పేరేపు దర్శకత్వం వహిస్తున్నారు. పి. విమల ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తుండగా... రోషన్ కనకాల పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం సినిమాను ప్రకటించారు. అంతేకాదండోయ్ ఈ చిత్రంలో రోషన్ లుక్ ను కూడా విడుదల చేశారు. అందులో రోషన్ డీజే లుక్ లో కనిపిస్తున్నాడు. చెవిలో హెడ్ సెట్ బ్లాక్ గ్లాసెస్ యాష్ కలర్ హుడూ విత్ వాచ్ తో చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. కొత్తతరం రొమాంటిక్ కామెడీ చిత్రం ఇది. అయితే ఈ సినిమాకు ఇంకా పేరు పెట్టలేదు. రాజీవ్ కనకాల ట్రెండీ అవతారంలో కనిపిస్తారని.. సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ చిత్రానికి నవీన్ యాదవ్ ఛాయాగ్రహణం అందిస్తుండగా.. శ్రీ చరణ్ పాకాల సంగీతం సమకూరుస్తున్నారు. కనకాల ఫ్యామిలీ నుంచి రోషన్ హీరోగా వస్తుండడంతో.. కనకాల ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. హీరోయిన్ ఎవరు కథ ఎలా ఉండబోతుందని అంతా గూగుల్ సెర్చ్ చేస్తున్నారు. ఇంకా కొంత కాలం ఆగితే తప్పు ఈ సినిమాకు సంబంధించిన అప్ డేట్లు బయటకు వచ్చేలా లేవు.

## రావసణాసురగా వస్తోన్న రవితేజ



హీరో రవితేజ ధమాకా సినిమాతో ఇటీవలే హిట్టు కొట్టిన ఆయన తాజాగా.. మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యూనిక్ థ్రిల్లర్ జోనర్ లో రావణాసుర సినిమా తెరకెక్కుతుండగా... ఈ చిత్రాన్ని సుధీర్ వర్మ డైరెక్ట్ చేస్తున్నారు. రావణాసుర మూవీలో అనూ ఇమ్మాన్యుయేల్, పూజితా పొన్నాడ, దక్షా నగార్కర్, ఫరియా అబ్దుల్లా, మేఘా ఆకాశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ చిత్రానికి సంబంధించిన ఓ లిరికల్ పాటను చిత్రబృందం ఈరోజే విడుదల చేసింది. వెయ్యినొక్క జిల్లాల వరకు వింటున్నాము నీ కీర్తినే.. అంటూ సాగే ఈ పాట చాలా బాగుంది. హీరో రవితేజ, మేఘా ఆకాశ్ పై చిత్రీకరించిన ఈ సాంగ్ లో వారిద్దరూ చాలా అందంగా, స్టైలిష్ గా కనిపిస్తున్నారు. 1991లో వెంకటేష్ హీరోగా వచ్చిన సూర్య ఐపీఎస్ సినిమాలోని పాటకు ఇది రీమిక్స్. సిరివెన్నెల రాసిన ఆ పాటకు అప్పట్లో ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఇప్పుడు ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించగా.. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఈ సాంగ్ తెరకెక్కింది. అయితే ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. మార్చి 6వ తేదీన విడుదలైన టీజర్ కు కూడా విశేష స్పందన లభించింది. టీజర్ లో ముందుగా క్రైమ్ చేసిన వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నట్లు చూపించి.. రవితేజ పాత్రను చాలా వైలెంట్ గా చూపించారు. అలాగే ఈ చిత్రంలో రవితేజ లాయర్ గా కనిపించబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థం అవుతుంది.ఆయన హీరోనా, విలనా.. ఆయన క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది అనేది ఇప్పటికీ తెలియదు. అక్కినేని హీరో సుశాంత్ రావణాసుర సినిమాలో విలన్ పాత్రలో నటిస్తుండటం విశేషం. వీళ్లే కాకుండా రవితేజ రావణాసుర సినిమాలో రావు రమేశ్, మురళీ శర్మ, సంపత్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, రవితేజ టీమ్ వర్క్స్ బ్యానర్లపై ఈ చిత్రం రూపుదిద్దు కుంటోంది. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రావణాసుర చిత్రం ఏప్రిల్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 17న విడుదలవుతున్న ఉపేంద్ర కబ్జా

నటుడిగానే కాదు దర్శకుడిగా కూడా ఉపేంద్ర ఎంతటి ప్రతిభావంతుడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆయన తెరకెక్కించిన సినిమాలే అందకు నిదర్శనం. ఉపేంద్ర దర్శకత్వం వహించిన ప్రతీ సినిమా ఒక ఆణిముత్యమే. ఆయన సినిమాల్లోని హీరో క్యారెక్టరైజేషన్ కల్పితంలా కాకుండా నిజ జీవిత పాత్రలా అనిపిస్తుంటుంది. సమాజంలోని లోపాలను ఎత్తిచూపిస్తూ.. సెటైరికల్‌గా అదే సమయంలో ఎంటర్‌టైనింగ్ ఉండేలా ఆయన సినిమాలు రూపొందిస్తుంటాడు. ప్రముఖ సినిమా వెబ్‌సైట్ 'ఐఎమ్‌డీబీ' టాప్-50 వరల్డ్ బెస్ట్ డైరెక్టర్‌లో ఉపేంద్రకు 17వ స్థానం ఇచ్చిందంటే.. ఆయన స్థాయి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అయితే గతకొంత కాలంగా ఉపేంద్ర దర్శకత్వానికి దూరంగా ఉంటున్నాడు. ఆదే సమమంలో నటుడిగా తెగ బిజీ అయిపోయాడు. కాగా దాదాపు ఏడేళ్లు గ్యాప్ తీసుకొనిమళ్లీ మెగాఫోన్ పట్టాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. న్యూఇయర్ సందర్భంగా రిలీజైన గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు తెచ్చిపెట్టింది. అయితే గతకొన్ని రోజులుగా ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. కాగా తాజాగా 'కబ్జా' ప్రమోషన్‌లలో ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను ఉపేంద్ర పంచుకున్నాడు. చాలా కాలం తర్వాత నేను దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఈ సినిమాలో నా బెస్ట్ స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ చూస్తారు. ఈ సినిమా గనుక మీకు అర్థమైతే మీరు సూపర్‌స్టార్ అవుతారు' అంటూ చెప్పుకొచ్చాడు. దాంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఎక్కడలేని అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఉపేంద్ర నటించిన కబ్జా మార్చి 17న పాన్ ఇండియా స్థాయిలో రిలీజవుతుంది. కిచ్చా సుదీప్ కీలకపాత్రలో నటించిన ఈ సినిమాలో శ్రియా హీరోయిన్‌గా నటిస్తుంది



## పవన్ పక్కన హీరోయిన్‌గా నిధి అగర్వాల్




టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ ఇమేజ్ దిశగా అడుగులు వేస్తున్న అందాల భామ నిధి అగర్వాల్. ఈ అమ్మడు ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కి జోడీగా హరిహర వీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా చివరి దశకి వచ్చేసింది. ఇప్పుడు మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న రాజా డీలాక్స్ మూవీలో కూడా నిధి అగర్వాల్ నటిస్తుంది. ఇదిలా ఉంటే మిస్టర్ మజ్ను మూవీ తర్వాత చాలా లాంగ్ గ్యాప్ తీసుకున్న నిధి అగర్వాల్ కొంతకాలం సోషల్ మీడియాకి కూడా దూరంగా ఉంది. ఇక హరిహర వీరమల్లు సినిమాలో అనూహ్యంగా ఛాన్స్ సొంతం చేసుకుంది. పవన్ కళ్యాణ్ కి జోడీగా ఏకంగా పాన్ ఇండియా సినిమాలో నటించే ఛాన్స్ రావడంతో మెజారిటీ డేట్స్ ని ఆ సినిమాకి ఇచ్చింది. ఇక ఈ మూవీ చివరి దశకి వచ్చే సరికి పాన్ ఇండియా స్టార్ పభాస్ కి జోడీగా నటించే ఛాన్స్ ని పట్టేసింది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం నిధి అగర్వాల్ గురించి టాలీవుడ్ సర్కిల్ లో మరో హాట్ టాపిక్ వినిపిస్తుంది. ఈ బ్యూటీ మరో ముగ్గురు స్టార్ హీరోల సినిమాల కోసం సిద్ధం అవుతుందని టాక్. ప్రస్తుతం ఆ సినిమాలకి సంబందించిన నిధి అగర్వాల్ ని ÷నైల్ చేసే పనిలో ఉన్నారని టాక్. త్వరలో ఆ సినిమాలకి సంబందించిన ప్రకటనలు వచ్చే అవకాశం ఉందనే మాట వినిపిస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈ మధ్య నిధి అగర్వాల్ మరల సోషల్ మీడియాలో యాక్టివ్ గా మారింది. రెగ్యులర్ గా హాట్ ఫోటోలు షేర్ చేస్తూ హీట్ పెంచుతుంది.

## దసరా చిత్రంపై పెరుగుతున్న అంచనాలు



నేచురల్ స్టార్ నాని హీరోగా పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న సినిమా దసరా గురించి అందరికీ తెలిసిందే. అయితే దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదలకానున్న ఈ చిత్రంలో నానికి జోడిగా కీర్తి సురేష్ నటిస్తోంది. సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ సినిమా పక్కా మాస్ మసాలా ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోంది.ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీగా బ్జడెట్ పెట్టి నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ చిత్రం అదిరిపోయే రికార్డును సొంతం చేసుకుంది. ఇటీవలే విడుదలైన దసరా సినిమా ట్రైలర్ కి అనూహ్య స్పందన లభించింది. ఈ ట్రైలర్ ను మొత్తం ఐదు భాషల్లో విడుదల చేయగా... 20 మిలియన్లకు పైగా వ్యూస్ ను సాధించింది. అలాగే 4.60 లక్షల లైకులను రాబట్టింది. తెలుగుతో పాటు తమిళ్ కన్నడ మలయాళం హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రం ఒకే రోజు ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ చిత్రంలో నాని ధరణిగా కనిపిస్తుండగా.. ఊర మాస్ లుక్ లో అదరగొట్టాడు. అదిరిపోయ్యే ÷ట్లు పవర్ ఫుల్ డైలాగ్స్ ఉండడంతో ఎక్కువ మంది ఈ ట్రైలర్ ను ఇష్టపడుతున్నారు. అంతేకాదండోయ్ సినిమా ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని తెగ వేచి చూస్తున్నారు. చిత్తు చిత్తుల గుమ్మ అంటూ వచ్చే బతుకమ్మ పాటతో మొదలైన ఈ ట్రైలర్ లో.. నాలాంటి అమ్మాయి దొరికిందంటే.. ధరణిగా పెట్టి పుట్టావురా నా కొడకా అంటూ కీర్తి చెప్పే డైలాగ్ ఒక్కొక్కనికి మొల్తాడు కింద గుడాల్ రాల్తాయ్ బ్యాంచెత్ అని నాని చెప్పే డైలాగ్ లు ట్రైలర్ లో హైలెట్ అయ్యాయి. అలాగే ఇటీవలే విడుదలైన చమ్కీల అంగీలేసి పాట కూడా నెట్టింటిని షేక్ చేస్తోంది. సినిమా టీజర్ పాటలు ట్రైలర్లు... చిత్రంపై భారీ అంచనాలు రేకెత్తిస్తున్నాయి. నాని కీర్తి సురేష్ లు హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి సముద్రఖని సాయి కుమార్ వంటి వారు కీలక పాత్రలో నటిస్తున్నారు. సత్యం సూర్య సినిమాటోగ్రఫీ నవీన్ నూలి ఎడిటింగ్ చేస్తున్నారు. మార్చి 30వ తేదీన దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. అయితే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని సింగరేణి వద్ద జరిగింది.

## ఆహాలో 22న వస్తున్న
## వినరో భాగ్యము విష్ణు కథ



తొలి సినిమా 'రాజావారు రాణిగారు'తో అటు ఇటుగా మార్కులు వేయించుకున్న కిరణ్.. 'ఎస్.ఆర్ కళ్యాణమండపం'తో వంద మార్కులు కొట్టేశాడు. రెండో సినిమాకే బ్లాక్‌బస్టర్ విజయం సాధించి యూత్‌లో ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత మాత్రం వరుసగా మూడు ప్లాపులు. మధ్యలో 'సమ్మతమే' కాస్త బెటర్ అనిపించినా.. కమర్షియల్‌గా సేఫ్ కాలేదు. ఇక కిరణ పని అయిపోయంది అనుకున్న టైమ్‌లో 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమాతో మంచి కంబ్యాక్ ఇచ్చాడు. మురళి కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 18న విడుదలైంది. రిలీజ్‌కు ముందు జరిపిన హడావిడితో సినిమాపై ఎక్కడలేని క్రేజ్ వచ్చింది. పైగా గీతా సంస్థ నుంచి వస్తున్న సినిమా కావడంతో అందరిలోనే అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ తర్వాత మిక్స్డ్ టాక్ తెచ్చుకున్నా.. కలక్షన్‌లలో మాత్రం జోరు చూపించింది. ఇప్పటికే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం డిస్ట్రిబ్యూటర్‌లకు లాభాలు తెచ్చిపెట్టేపనిలో ఉంది. ఇదిలా ఉంటే ఈ సినిమా డిజిటల్ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్‌ను ఆహా ప్రకటించింది. ఉగాది పర్వదినాన ఈ సినిమాను మార్చి 22 నుంచి స్ట్రీమింగ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక ఈ సినిమాలో కిరణ్‌కు జోడీగా కశ్మీర పరదేశి హీరోయిన్‌గా నటించింది. చైతన్య భరద్వాజ్ స్వరాలు సమకూర్చాడు.

## ఆయిల్ పామ్ పంటలను
## సాగు చేసి అధిక లాభాలు పొందండి

- కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య

**తరిగొప్పుల మార్చి 16 (ప్రజామంటలు):** ఆయిల్ పామ్ పంటలు సాగు చేసి రైతులు లాభాలు ఆర్జించాలన్నారు జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య గురువారం, తరిగొప్పుల మండల కేంద్రంలో ఆయిల్ ఫామ్ సాగుచేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్ పామ్ పంటల సాగు అధిక లాభాలను చేకూరుస్తుందని మన దేశంతో పాటు ఇతర దేశాలలో మంచి డిమాండ్ ఉందని ఆయన అన్నారు. జనగామ జిల్లా ఆయిల్ ఫామ్ కు అనుకూలమైన ప్రదేశం అని ఈ పంటల సాగు వల్ల ఎంతో ప్రయోజనం ఉందని, మన జిల్లాలో 4వేల ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 3 వేల ఒక్క ఎకరం సాగు చేసి రాష్ట్రంలో మన జిల్లా 75% లక్ష్యం పూర్తి చేసిందన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంట సాగుకు చేయుటకు రైతులకు అనేక సౌకర్యాలు సబ్సిడీ లు కల్పిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు, కావున రైతులు ఆయిల్ పామ్ ను సాగు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.... ఇప్పటివరకు ప్రభుత్వం నుండి వచ్చిన సబ్సిడీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోతారం గ్రామంలో జరుగుతున్న కంటి వెలుగుల క్యాంపును తనిఖీ చేశారు, ఈ సందర్భంగా వైద్య పరీక్షలకు వచ్చే వారితో మాట్లాడుతూ వారికి అందుతున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో ఇంకా వైద్య పరీక్షలకు హాజరు కాని వారిని గుర్తించి వైద్య



పరీక్షలకు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆశ, ఏఎన్ఎం సంబంధిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని కేఆర్.లత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేందర్, రైతూ మధుసూదన్ రెడ్డి, రవికాంత్, శశిగౌడ్, తదితరులు ఉన్నారు.

## హక్కుల నేతపై
## హత్యాయత్నంను ఖండిస్తున్నామ్

- నిందితులందరినీ వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలి
- కుట్రదారులు ఎవరైనా, ఎంతటివారైనా చట్టపరంగా శిక్షించాలి
- ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు ఏకం కావాలి
- టిజెఎస్ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి



**బుగ్గారం మార్చి 16 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి లో బుధవారం రాత్రి ప్రశ్నించే గొంతుక, పౌర హక్కుల నేత పోగుల రాజేశం పై జరిగిన హత్యాయత్నం దాడిని తెలంగాణ జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఖండించారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.... ఈ హత్యాయత్నం దాడికి పాల్పడ్డ వ్యక్తితో పాటు అతని వెనుక ఉన్న రాజకీయ శక్తులపైన కూడా పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే నిందితుడిని, అతన్ని ప్రోత్సహించిన వారిని, ఈకుట్ర వెనుక దాగిఉన్న రాజకీయ శక్తులను వెలికితీసి వారందరినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. పోగుల రాజేశం కు, అతని కుటుంబానికి తగిన న్యాయం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, పోలీసులది, ఈప్రాంత ప్రజాప్రతినిధులదేనని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఈదాడిని ఖండించాలని పిలుపునిచ్చారు. అందరూ ఏకమై ఈదాడిపట్ల నిరసన తెలిపుతూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని చుక్క గంగారెడ్డి పిలుపునిచ్చారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com